శుక్రవారం
27-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 97
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

బిల్కిస్ కేసులో గుజరాత్‌కు ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బిల్కిస్ బానో కేసుకు సంబంధించి చేసిన వ్యాఖ్యలను తీర్పు నుంచి తొలగించాలంటూ గుజరాత్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. బిల్కిస్ కేసులో 11 మంది దోషుల విడుదల చెల్లదని జనవరిలో తీర్పునిచ్చింది. గుజరాత్ ప్రభుత్వ అధికార దుర్వినియోగాన్ని దుయ్యబట్టింది. దోషులను రెండు వారాల్లోగా జైల్లో పెట్టాలని ఆదేశించింది. దోషులతో గుజరాత్ ప్రభుత్వం కుమ్మక్కైనట్లు తోస్తోందని తీర్పులో సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. దీంతో ఈ వ్యాఖ్యలు తొలగించాలని కోరుతూ గుజరాత్ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. దీనిని విచారించిన సుప్రీం ధర్మాసనం అందులో తప్పేమీ లేదని తేల్చిచెప్పింది.



నేడు ఏబీ బర్ధన్ శతజయంతి సభ

విశాలాంధ్ర-విజయవాడ: నిస్వార్థ ప్రజాసేవకులు, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్ధన్ శత జయంతి సభ సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యాలయ ప్రతినిధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక హనుమాన్‌పేటలోని దాసరి నాగభూషణరావు భవన్‌లో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఈ సభ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో పాటు ఇతర రాష్ట్ర నాయకులు పాల్గొంటారని వెల్లడించారు.

5న పీఎం కిసాన్ నిధులు విడుదల

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త తెలిపింది. పీఎం కిసాన్ 18వ విడత నిధులను అక్టోబర్ 5న విడుదల చేయనున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ పథకం ద్వారా కేంద్రం ఏటా ఒక్కో రైతుకు రూ. 6 వేల చొప్పున సాయమందిస్తోంది. 2018 డిసెంబర్‌లో ఈ పథకాన్ని ప్రారంభించింది. డీబీటీ ద్వారా డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమవుతున్నాయి. ప్రతి నాలుగు నెలలకొకసారి రూ.2 వేల చొప్పున మూడు వాయిదాలలో డబ్బు

- మిగతా 2 లో

లెబనాన్ విడిచి వెళ్లండి: భారత్

న్యూఢిల్లీ: గత మూడు రోజులుగా లెబనాన్‌పై ఇజ్రాయిల్ సైన్యం బాంబు దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల వల్ల వందలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. దీంతో లెబనాన్‌ని విడిచి వెళ్లాలని అక్కడున్న భారతీయులకు భారత విదేశాంగ శాఖ సలహా ఇచ్చింది. ఈ మేరకు బీరుట్‌లోని భారత రాయబార కార్యాలయం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. భారత్‌లో ఉంటున్న ప్రజలు

- మిగతా 2 లో

ఇంటి నుంచే పని!

- ఐదేళ్లలో 20లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయం
- ప్రణాళికలు సిద్ధం చేయాలని చంద్రబాబు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హైబ్రిడ్ విధానంలో ఇంటి వద్దనుంచే పనిచేసే కార్యక్రమానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రైవేటు రంగంలో పెద్దఎత్తున ఉద్యోగాలను సృష్టించవచ్చని, ఆదిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అంశంపై ముఖ్యమంత్రి గురువారం నైపుణ్య శిక్షణ శాఖ, ఎంఎస్ఎంఇ డిపార్ట్‌మెంట్, ఇండస్ట్రీస్, సెర్ప్ శాఖ అధికారులతో సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న ఎన్నికల హామీని నేరవేర్చే విధంగా ప్రణాళికలతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా నైపుణ్య శిక్షణ ద్వారా పరిశ్రమలకు అవసరమైన విధంగా మానవ వనరులు సమకూర్చాలని సీఎం సూచించారు. నైపుణ్యం మెరుగుపర్చడం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉందన్నారు. బహుళజాతి కంపెనీలతో శిక్షణ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ నిరంతరం కొనసాగేలా చేపట్టాలన్నారు. విజయవాడలో వరదల్లో మునిగి సర్వం కోల్పోయిన బాధితులు తమకు ఉపాధి చూపించాలని కోరారని, ఆ ప్రాంతంలో ఎటువంటి ఉపాధి కల్పన చేపట్టవచ్చనే అంశంపై పరిశీలన జరిపి కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. వివిధ కారణాలతో గ్రామాల్లో ఉండిపోయిన వారికి పనిచేసేందుకు అవసరమైన అవకాశాలను కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయని, ప్రభుత్వం, పారిశ్రామిక వేత్తలు కలిసి ఇందుకోసం పనిచేయాల్సి ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై వచ్చే సమావేశానికి యాక్షన్ ప్లాన్ తో రావాలని అధికారులకు సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు, పలువురు పరిశ్రమ రంగ నిపుణులు పాల్గొన్నారు.

క్రీడా వికాసకేంద్రాల పూర్తికి రూ.23 కోట్లు

మౌలిక సదుపాయాల కల్పనతో క్రీడారంగాన్ని తిరిగిగాడిలో పెట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. యువజన సర్వీసులు, క్రీడల శాఖపై సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. గతంలో తెలుగు దేశం ప్రభుత్వం వివిధ స్టేడియాలు, క్రీడా ప్రాంగణాల నిర్మాణం చేపడితే.... వైసీపీ ప్రభుత్వం అన్ని పనులు నిలిపివేసిదని విమర్శించారు. నాడు ప్రారంభమై కొంతమేర పూర్తి అయిన స్టేడియాలు, క్రీడా ప్రాంగణాలు, క్రీడా వికాస కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన 35 క్రీడా వికాసకేంద్రాల పూర్తికి రూ.23 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. కబడ్డీ వంటి ఆటలకు ఆటస్థలాలు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఆటల ద్వారా ప్రజల ఆరోగ్యం బాగుంటుందని....ఐక్యత పెరుగుతుందని..ఇదొక మంచి సంస్కృతిగా నిలుస్తుందని సీఎం అన్నారు. 2027 జాతీయ క్రీడలు మన రాష్ట్రంలో నిర్వహించాలనేది లక్ష్యంగా పెట్టుకుని అందుకు

- మిగతా 2 లో

బీపీ, షుగర్ మందుల్లో

నాణ్యతాలోపం

కేంద్రం తనిఖీల్లో వెల్లడి



న్యూఢిల్లీ: మార్కెట్‌లో అత్యధికంగా అమ్ముడుపోయే బీపీ, షుగర్, పారాసిటమాల్ మందుల్లో నాణ్యతా లోపాలు ఉన్నట్టు తాజాగా బయటపడింది. కేంద్ర ఔషధ రంగ నియంత్రణ మండలి (సీడీఎస్‌సీఓ) ఇటీవల అనేకచోట్ల జరిపిన తనిఖీల్లో ఈ లోపాలు వెలుగు చూశాయి. పారాసిటమాల్- 500 ఎమ్‌జీ, పాన్-డీ, కాల్షియం సప్లిమెంట్లు వంటి ఔషధాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించినట్టు అధికారులు గుర్తించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు. ఆ ఫలితాలతో ఓ జాబితా రూపొందించారు. నాణ్యతా ప్రమాణాలు లోపించిన ఔషధాల్లో విటమిన్ బీ కాంప్లెక్స్, విటమిన్ సీ సాఫ్ట్ జెల్స్, షెల్‌కాల్ (విటమిన్ సీ, డీ3), డయాబెటిక్ ఔషధం గ్లిమిపిరైడ్, బీపీ ఔషధం టెల్మిసార్టాన్ కూడా ఉన్నాయి. మొత్తం 53 ఔషధాల్లో నాణ్యత లోపం కనిపించినట్టు తేలింది. నాణ్యతా లోపాలు ఉన్న ఈ ఔషధాలను ఆల్కెమ్ లేబొరేటరీస్, హిందుస్థాన్ యాంటీబయాటిక్స్, హెటిరో డ్రగ్స్, కర్నాటక యాంటీబయాటిక్స్ అండ్ ఫార్మాసూటికల్స్ లిమిటెడ్, ప్యూర్ అండ్ క్యూర్ హెల్త్‌కేర్, మెగ్ లైఫ్‌సైన్సెస్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నట్టు కేంద్ర ఔషధ రంగ నియంత్రణ మండలి పేర్కొంది. ఈ ఔషధాల్లోనూ

- మిగతా 2 లో

వాసుదేవరెడ్డి కార్యాలయంలో సీఐడీ తనిఖీలు

కీలక పత్రాలు స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం కుంభకోణం కేసులో సీఐడీ దర్యాప్తు వేగవంతం చేసింది. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి కార్యాలయంలో గురువారం విస్తృత సోదాలు చేపట్టింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ తనిఖీల్లో కీలక పత్రాలను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాసుదేవరెడ్డిని బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ పదవి నుండి తొలగించింది. వైసీపీ హయాంలో మద్యం వ్యాపారంలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయన్న అభియోగాల నేపథ్యంలో వాసుదేవరెడ్డి కార్యాలయాన్ని స్వాధీనం చేసుకుంది. మద్యం కుంభకోణంపై ఏపీ సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేస్తోంది. మూడు రోజులుగా వాసుదేవరెడ్డి కార్యాలయంలో తనిఖీలు నిర్వహించిన సీఐడీ... కీలక పత్రాలు, హార్డ్ డిస్క్‌లు స్వాధీనం చేసుకుంది. రాష్ట్రంలోని కొన్ని మద్యం కంపెనీలకే అధికంగా కొనుగోలు ఆర్డర్లు ఇచ్చినట్లు సీఐడీ అధికారులు

- మిగతా 2 లో

కీచక వార్డెన్‌కు

మరణ దండన

విద్యార్థులపై లైంగికదాడి కేసులో పోక్సో కోర్టు సంచలన తీర్పు

గువహతి: అరుణాచల్ ప్రదేశ్‌లో కొంతకాలం క్రితం వెలుగు చూసిన అత్యాచార కేసులో పోక్సో ప్రత్యేక న్యాయస్థానం కీలక తీర్పునిచ్చింది. దాదాపు 21 మంది విద్యార్థులపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో హాస్టల్ వార్డెన్ యుమ్కెన్ బాగ్రాకు మరణ దండన విధించింది. ఇదే కేసులో మాజీ ప్రధానోపాధ్యాయుడు సింగ్‌తుంగ్ యోర్పెన్‌తో పాటు హిందీ టీచర్ మార్బోమ్ న్గోమ్‌దిర్‌లకు 20 ఏళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జవేప్ల చై సంచలన తీర్పు వెలువరించారు.

అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఓ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో లైంగిక దాడుల వ్యవహారం 2022లో వెలుగు చూసింది. తన 12 ఏళ్ల కవల కుమార్తెలను హాస్టల్ వార్డెన్ లైంగికంగా వేధిస్తున్నాడని ఓ తండ్రి ఫిర్యాదు చేయగా... మరికొందరు బాధితులు కూడా ఇటువంటి ఆరోపణలు చేయడంతో ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు

- మిగతా 2 లో

సీబీఐకి కర్నాటక ప్రభుత్వం చెక్

బెంగళూరు: ముడా (మైసూరు నగరాభివృద్ధి సంస్థ) కుంభకోణం కర్నాటక రాజకీయాల్లో కలకలం సృష్టిస్తోంది. ఈ తరుణంలో సిద్దరామయ్య ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కేసులు విచారించేందుకు సీబీఐకు అనుమతి ఉపసంహరించుకుంది. ఈ కుంభకోణంలో వాస్తవాలు వెలికి తీసేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో దర్యాప్తు చేయించాలని డిమాండ్లు వస్తోన్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. 'రాష్ట్రంలో సీబీఐ విచారణకు అనుమతి ఉపసంహరించుకుంటున్నాం. ఆ దర్యాప్తు సంస్థను దుర్వినియోగం చేస్తారని ఆందోళన చెందుతున్నాం. వారిది పక్షపాత వైఖరి. ముడా కుంభకోణంతో దీనికి ఎలాంటి సంబంధం లేదు. మేం సీబీఐకి ప్రతిపాదించిన అన్ని కేసుల్లో ఛార్జిషీట్లు దాఖలు చేయలేదు. ఎన్నో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మేం రిఫర్ చేసిన కేసులను వారు తిరస్కరించిన సందర్భాలు అనేకం. వారు (సీబీఐని ఉద్దేశించి) తప్పుడు మార్గంలో పడకుండా నియంత్రించడానికే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని కర్నాటక న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ గురువారం మీడియాతో మాట్లాడారు. అలాగే తన అనుమతి లేకుండా గవర్నర్ అడిగిన ఎలాంటి సమాచారం అందించకూడదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కర్నాటక కేబినెట్ ఆదేశాలు ఇచ్చింది. అనుమతిని నిరాకరించిన రాష్ట్రాల్లో... ఏదైనా కేసును సీబీఐ విచారించాల్సి వస్తే, దానికి ఆ ప్రభుత్వం రాతపూర్వక అనుమతి తప్పనిసరి. ఇప్పుడు బెంగాల్‌లో ఆర్జీ కర్ ఆసుపత్రిలో చోటుచేసుకున్న హత్యాచార ఘటనలో సీబీఐ దర్యాప్తు ఆ కోవలోనిదే. అంతకుముందు మమతా బెనర్జీ ప్రభుత్వం కూడా కర్నాటక మాదిరిగానే అనుమతి ఉపసంహరించుకుంది.

ఇంకా ఆ జాబితాలో తమిళనాడు (డీఎంకే), కేరళ (వామపక్షకూటమి) వంటివి ఉన్నాయి. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకొని కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీని దుర్వినియోగం చేసిందని విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే.

సంజయ్‌రౌత్‌కు

15 రోజుల జైలు

ముంబై: పరువు నష్టం కేసులో శివసేన-యూబీటీ ముఖ్య నేత సంజయ్‌రౌత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. బీజేపీ నేత కిరీట్ సోమయ్య భార్య మేధ సోమయ్య దాఖలు చేసిన పరువునష్టం కేసులో ఆయనకు 15 రోజులు జైలు శిక్ష విధిస్తూ ముంబై కోర్టు తీర్పునిచ్చింది. మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 500 కింద రౌత్‌ను దోషిగా నిర్ధారించింది. ఆయనకు రూ.25 వేలు జరిమానాతో పాటు 15 రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పుచెప్పింది. మహారాష్ట్రకు చెందిన బీజేపీ నేత కిరీట్ సోమయ్య కుటుంబసభ్యులు ఓ స్వచ్ఛందసంస్థను నడుపుతున్నారు. మీరా భయందర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.100 కోట్ల టాయిలెట్ స్కామ్ జరిగిందని సంజయ్‌రౌత్ ఆరోపించారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పలు మీడియాల్లో కథనాలు వెలువడ్డాయి. అయితే, వీటిని ఖండించిన కిరీట్ సోమయ్య సతీమణి మేధ ఎటువంటి ఆధారాలు లేకుండా తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కోర్టును ఆశ్రయించారు.

ఇజ్రాయిల్ ధిక్కారస్వరం

పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. హెజ్బుల్లా అంతమే లక్ష్యంగా ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేస్తోంది. క్షిపణులు, రాకెట్లతో విరుచుకుపడుతోంది. లెబనాన్ సరిహద్దులో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో ఇప్పటి వరకు 600 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. సుమారు 5 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.

2లో

బంగారం ధరకు రెక్కలు

రూ.78 వేల మార్కు దాటిన వైనం

న్యూఢిల్లీ: బంగారం ధరకు రెక్కలు వచ్చాయి. పది గ్రామాలు రూ.78వేల మార్కును దాటింది. దేశ రాజధాని దిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర మరో రూ.400 పెరిగి రూ.78,250కి పెరిగింది. అంతర్జాతీయంగా పసిడికి డిమాండ్, దేశీయంగా వర్తకుల కొనుగోళ్ల క్రమంలో ధర

- మిగతా 2 లో

ఇదీ లోకం!

బీజేపీకి బాబు, పవన్, జగన్ గులాంగిరీ

కేంద్ర అన్యాయంపై 2న నిరసనలు: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు, పవన్, జగన్ బీజేపీకి గులాం గిరీ చేస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తుంటే వారు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. విజయవాడ ఏ-1 కన్వెన్షన్ సెంటరులో గురువారం షర్మిల అధ్యక్షతన పీసీసీ నూతన కార్యవర్గ సమావేశం

- మిగతా 2 లో

దాడులు ఆపండి

వామపక్ష పార్టీల డిమాండ్

న్యూఢిల్లీ: గాజాలో తక్షణమే కాల్పులు విరమించి, పోరు ముగించాలని ఐదు వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఉమ్మడి ప్రకటనను గురువారం విడుదల చేశాయి. గాజాలో ఇజ్రాయిల్ దురాక్రమణకు అక్టోబరు 7వ తేదీకి ఏడాది పూర్తి అవుతుందని, ఆ రోజును ఘర్షణ ముగింపునకు డిమాండ్ దినంగా పాటిస్తామని పేర్కొన్నాయి. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ), సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ), రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్‌పీ) ప్రధాన కార్యదర్శులు డి.రాజా, దీపాంకర్ భట్టాచార్య, జి.దేవరాజన్, మనోజ్ భట్టాచార్యతో పాటు సీపీఎం తరఫున ప్రకాశ్ కారత్ ఈ ప్రకటన విడుదల చేశారు. 'గాజాలో ఇజ్రాయిల్ దురాక్రమణ మొదలై అక్టోబరు 7వ తేదీకి ఏడాది. హమాస్ అంతమే లక్ష్యమంటూ మారణహోమాన్ని ఇజ్రాయిల్ కొనసాగిస్తోంది. పలస్తీనా ప్రజలపై విచక్షణారహితంగా దాడులు చేస్తోంది. ఇప్పటివరకు 42 వేల మంది పలస్తీనియన్లు చనిపోయారు. వీరిలో మహిళలు, పిల్లలే ఎక్కువగా ఉన్నారు. వేలాదిమంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. నివాస ప్రాంతాలు, పాఠశాలలు, ఆసుపత్రులనూ వదలకుండా భూతల, వైమానిక దాడులను ఇజ్రాయిల్ సాయుధ దళాలు కొనసాగిస్తున్నాయి. ఆగస్టు 6వతేదీ నాటికి ఇజ్రాయిల్ దురాక్రమణలో ప్రత్యక్ష, పరోక్ష మరణాలు 85 వేలకు పైమాటేనని 'ది లాన్సెట్' తెలిపింది' అని

- మిగతా 2 లో

ఇజ్రాయిల్ ధిక్కారస్వరం

కాల్పుల విరమణకు నెతన్యాహు నిరాకరణ

టెల్అవీవ్: పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. హెజ్బుల్లా అంతమే లక్ష్యంగా ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేస్తోంది. క్షిపణులు, రాకెట్లతో విరుచుకుపడుతోంది. లెబనాన్ సరిహద్దులో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో ఇప్పటి వరకు 600 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. సుమారు 5 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. పరిస్థితి తారస్థాయికి చేరడంతో అమెరికాతోపాటు ఫ్రాన్స్ జోక్యం చేసుకున్నా ఫలితం కనిపించడం లేదు. అమెరికా, ఫ్రాన్స్ 21 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇజ్రాయిల్ తిరస్కరించింది. హెజ్బుల్లాను అంతం చేయడం ద్వారా మాత్రమే ఉత్తర సరిహద్దుల్లో చోటుచేసుకున్న ప్రతిష్టంభనకు పరిష్కారం దొరుకుతుందని చెప్పుకొచ్చింది. 'ఉత్తరాదిలో చోటుచేసుకున్న సమస్యకు ఒకే ఒక్క పరిష్కారం ఉంది. అదే హెజ్బుల్లాను అంతం చేయడం' అని ఇజ్రాయిల్ రెవెన్యూశాఖ మంత్రి స్మోట్రిచ్ వెల్లడించారు. అమెరికా, ఫ్రాన్స్ చెప్పినట్లుగా కాల్పుల విరమణ ఒప్పందం చేసుకుంటే హెజ్బుల్లా కోలుకునేందుకు సమయం ఇచ్చినట్లవుతుందని వ్యాఖ్యానించారు. మరోవైపు బుధవారం రాత్రి బెకా వ్యాలీ, దక్షిణ లెబనాన్‌లోని సుమారు 75 హెజ్బుల్లా స్థావరాలపై దాడి చేసినట్లు ఇజ్రాయిల్ వెల్లడించింది. ఫైర్ లాంచర్లు, ఆయుధ భాండాగారాలను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. అంతకుముందు ఇజ్రాయిల్-లెబనాన్ సరిహద్దులో కొనసాగుతున్న ఉద్రిక్తతలపై లెబనాన్ ప్రధాని నజీబ్ స్పందించారు. కాల్పుల విరమణ ఒప్పందం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, ఇజ్రాయిల్-హెజ్బుల్లా మధ్య సంధి కుదిర్చేందుకు అమెరికా, ఫ్రాన్స్ తీవ్రంగా ప్రయత్నించాయి. 21 రోజుల పాటు కాల్పుల విరమణకు రెండు వర్గాలు అంగీకరించాలని తీర్మానించాయి. దీనికి యూరోపియన్ యూనియన్‌తోపాటు కొన్ని అరబ్ దేశాలు మద్దతు పలికాయి. వెంటనే దీనిని అమలు చేసేలా రెండు వర్గాలు కార్యాచరణ ప్రారంభించాలని కోరాయి. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు జోబైడెన్, ఫ్రాన్స్ ప్రధాని ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. కాల్పుల విరమణకు రావాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. 'గత ఏడాది అక్టోబరు 7న మొదలై, ముఖ్యంగా రెండు వారాల క్రితం నుంచి జరుగుతున్న కాల్పుల వల్ల సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక పౌరులకు ఇవి శరాఘాతంగా మారుతున్నాయి. కాల్పుల విరమణకు అంగీకరించి సాధారణ పౌరులంతా వాళ్ల స్వస్థలాలకు వెళ్లేందుకు వీలు కల్పించాలి' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వైమానిక దాడులతోపాటు లెబనాన్‌లోని హెజ్బుల్లా స్థావరాలపై భూతల దాడులు చేసేందుకు ఇజ్రాయిల్ సిద్ధంగా ఉందని ఆ దేశ సైన్యాధిపతి లెఫ్టినెంట్ జనరల్ హెర్జీ హలేవి ప్రకటించడంతో అగ్రదేశాలు ఈ ప్రకటన చేశాయి. మరోవైపు, యుద్ధం ఆపొద్దని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ఆదేశించారు. అమెరికా, ఫ్రాన్స్ సంధి ప్రతిపాదనలపై నెతన్యాహు స్పందించలేదని ఇజ్రాయిల్ ప్రధాని కార్యాలయం ప్రకటించింది. పూర్తిస్థాయి దళాలతో హెజ్బుల్లాతో పోరాటం చేయాలని నెతన్యాహు ఆదేశించినట్లు పేర్కొంది.

కుట్రతోనే హసీనాకు పదవీచ్యుతి

యూనస్ వెల్లడి

వాషింగ్టన్: రిజర్వేషన్ల అంశం బంగ్లాదేశ్‌ను నిప్పుల కుంపటిగా మార్చడంతో షేక్ హసీనా ప్రధాని పీఠం నుంచి దిగిపోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు, హసీనాను దింపడం పథకం ప్రకారం జరిగిన కుట్ర అని ఆ దేశ తాత్కాలిక సారథి మహ్మద్ యూనస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆయన ఈ విధంగా స్పందించారు. క్లింటన్ గ్లోబల్ ఇనిషియేటివ్ వార్షిక సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆ సమయంలో అక్కడ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఉన్నారు. యూనస్ మాట్లాడుతూ విద్యార్థి నాయకులు బంగ్లాదేశ్‌కు కొత్త రూపు తీసుకువచ్చారని కొనియాడారు. హసీనాను పదవి నుంచి దింపే కుట్ర వెనక ఎవరున్నారో బయటకు రాలేదని, కానీ మహఫుజ్ అబ్దుల్లా పాత్ర ఉండొచ్చని పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఇదంతా యాదృచ్ఛికంగా జరిగింది కాదని, ప్రణాళిక ప్రకారం జరిగిందని అన్నారు. ఇదిలా ఉంటే.. హసీనాను దించే కుట్రలో అమెరికా పేరు కూడా వినిపించింది. పదవి నుంచి దిగిపోవడానికి ముందు మేలో హసీనా చేసిన ప్రకటన అందుకు కారణమైంది. బంగ్లాదేశ్‌కు చెందిన సెయింట్ మార్టిన్ దీవిలో వైమానిక స్థావరం ఏర్పాటు చేసుకోవడానికి ఒక దేశానికి అనుమతిస్తే... తన ఎన్నిక సాఫీగా జరిగేటట్లు చేస్తానని ప్రతిపాదించినట్లు ఆమె చెప్పారు. ఆ ప్రకటన ఒక్కసారిగా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అమెరికానే ఆ దేశం అయి ఉంటుందనే ప్రచారం జరిగింది. మరోపక్క.. ఈ ఏడాది జనవరిలో జరిగిన బంగ్లా ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా సాగలేదని గతంలో అమెరికా విదేశాంగశాఖ వ్యాఖ్యానించింది.

భద్రతా మండలిలో భారత్‌కు చోటు

ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ మద్దతు

ఐరాస: ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు అంతర్జాతీయంగా మరింత మద్దతు లభిస్తోంది. భారత్‌కు ఫ్రాన్స్ మద్దతు ప్రకటించింది. మారుతున్న కాలానికనుగుణంగా భద్రతా మండలి మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని, భారత్ వంటి దేశాలకు కచ్చితంగా స్థానం కల్పించాలని సూచించింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్షోభాలను పరిష్కరించడం ఐరాసకు తీవ్ర సవాలుగా మారిందని వార్తలు వినిపిస్తున్న వేళ ఫ్రాన్స్ ఈ విధంగా వ్యాఖ్యానించింది. 'భద్రతా మండలి విస్తరణకు ఫ్రాన్స్ అనుకూలం. భారత్, జర్మనీ, జపాన్, బ్రెజిల్‌కూ శాశ్వత సభ్యత్వం ఉండాలి. ఆఫ్రికా నుంచి రెండు దేశాలకు ప్రాతినిధ్యం కల్పించాలి' అని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ సూచించారు. ఐరాస సర్వసభ్య సమావేశాల్లో ప్రసంగించిన ఆయన... ఐరాస భద్రతా మండలి సమర్థతను పునరుద్ధరించడానికి కేవలం ఈ మార్పులు సరిపోవన్నారు. యూఎన్ఎస్‌సీ అవలంబిస్తున్న విధానాల్లో మార్పులు రావాల్సి ఉందని ఫ్రాన్ అధ్యక్షుడు అభిప్రాయపడ్డారు. సామూహిక నేరాల కేసుల్లో వీటో అధికారాలకు పరిమితులు, శాంతి నెలకొల్పేందుకు అవసరమైన వ్యూహాలపై దృష్టి పెట్టడం వంటి మార్పులు రావాలన్నారు. క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టేందుకు సమయం ఆసన్నమైందని మెక్రాన్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కలిగి ఉన్న విషయం తెలిసిందే.

బీపీ, షుగర్ మందుల్లో నాణ్యతాలోపం

(మొదటిపేజీ తరువాయి)

నాణ్యతా లోపాలు బయటపడటంతో మరింత అప్రమత్త, తనిఖీలు అవసరమన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఔషధ రంగ నియంత్రణ సంస్థ పేర్కొన్న వివరాల ప్రకారం మెట్రోనిడాజోల్‌ను ప్రభుత్వం రంగ సంస్థ హిందుస్థాన్ యాంటీబయాటిక్ లిమిటెడ్ తయారు చేసింది. షెల్‌కాల్‌ను ప్యూర్ అండ్ క్యూర్ హెల్త్‌కేర్ సంస్థ సిద్ధం చేసింది. ఆల్కెమ్ సంస్థ రూపొందించిన క్లావామ్, పాన్ డీల్లో లోపాలు ఎక్కువగా ఉన్నట్టు పరీక్షల్లో వెల్లడైంది. తీవ్ర ఇన్ఫెక్షన్ల బారిన పడ్డ చిన్నారులకు ఇచ్చే సీపోడెమ్ ఎక్స్‌పీ 50 డ్రై సస్పెన్షన్‌లో లోపాలు ఉన్నట్టు తేలింది. ఈ ఔషధాన్ని హెటిరో సంస్థ ఉత్పత్తి చేస్తోంది. కర్నాటక యాంటీబయాటిక్స్ ఉత్పత్తి చేసిన పారాసిటమాల్ లోనూ నాణ్యత సంబంధిత సమస్యలు ఉన్నట్టు బయటపడింది.

బీజేపీకి బాబు, పవన్, జగన్ గులాంగిరీ

(మొదటిపేజీ తరువాయి)

జరిగింది. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్కం ఠాగూర్, ఏఐసీసీ సెక్రటరీ పాలక్ వర్మ, రఘువీరారెడ్డి, కేవీపీ రామచంద్రరావు, గిడుగు, రుద్రరాజు, సాకే శైలజానాథ్, జేడీ శీలం, తులసిరెడ్డి హాజరయ్యారు. షర్మిల మాట్లాడుతూ బీజేపీతో ఒకరిది అక్రమ పొత్తు అయితే... మరొకరిది సక్రమ పొత్తు అని ఎద్దేవా చేశారు. అక్టోబరు రెండో తేదీ గాంధీ జయంతి రోజున బీజేపీ రాష్ట్రానికి చేసిన అన్యాయంపై నిరసన చేపడతామని చెప్పారు. బీజేపీ చేసిన అన్యాయంపై యుద్ధం చేయాలన్నారు. 2029లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో రావాలని, తాను రాజకీయాల్లో అడుగు పెడతానని ఏ రోజు అనుకోలేదని, కానీ పరిస్థితులు తీసుకొచ్చాయని చెప్పారు. తాను వైఎస్ఆర్ తెలంగాణ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశానని, ప్రస్తుతం నా అవసరం అక్కడ లేదని, ఆంధ్ర రాష్ట్రంలో ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావాల్సి ఉందని, అందుకే ఇక్కడ నా అవసరం ఉందన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అవ్వాలనేదే వైఎస్ఆర్ కోరిక అని చెప్పారు. రాహుల్ ప్రధాని అయితేనే మనకు ప్రత్యేక హోదా వస్తుందని, విభజన సమస్యలు అన్నీ నెరవేరతాయని పేర్కొన్నారు. అందరినీ కలుపుకుని ముందుకెళ్లాలని కోరారు. రఘువీరారెడ్డి మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని ప్రజల్లోకి తీసుకు వెళ్దామని చెప్పారు. షర్మిల న్యాయకత్వంలో పార్టీ బలోపేతం అవుతుందన్నారు. జమిలి ఎన్నికలు బీజేపీ సొంత అజెండా అని విమర్శించారు.

దాడులు ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటన పేర్కొంది. అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) ఉత్తర్వులను సైతం ఇజ్రాయిల్ బేఖాతరు చేయడాన్ని గుర్తు చేసింది. కాల్పుల విరమణ కోసం చేపట్టే అర్థవంతమైన చర్చలనూ ధిక్కరించిందని, గాజాలో సైనిక చర్యను నిర్దాక్షిణ్యంగా సాగిస్తోందని విమర్శించింది. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోని పలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ భీకర దాడులు చేసిందని, పేజర్లు, వాకీటాకీలు వంటి కమ్యూనికేషన్ పరికరాలు పేల్చి... విధ్వంసం సృష్టించేందుకు యత్నించిందని, యుద్ధాన్ని లెబనాన్‌కు విస్తరించిందని ప్రకటన పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఇజ్రాయిల్ తీరును నిరసిస్తూ, గాజాపై దురాక్రమణ ముగింపునకు డిమాండ్ చేస్తున్నారని గుర్తుచేసింది.

5న పీఎం కిసాన్ నిధులు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తున్నారు. పీఎం కిసాన్ యోజన 16వ విడతలో 93 మిలియన్ల మంది రైతులు ఒక్కొక్కరు రూ.2 వేల వరకు లబ్ధిపొందారు. పీఎం కిసాన్‌కు అర్హత పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరని అధికారులు తెలిపారు. పీఎం కిసాన్ నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు బదిలీ కావాలంటే...బ్యాంక్ ఖాతాను ఆధార్ నంబర్‌తో లింక్ చేయాలి. పీఎం కిసాన్ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నట్లయితే... ఆధార్, బ్యాంక్ అకౌంట్, భూ రికార్డులు ధృవీకరించాల్సి ఉంటుంది.

లెబనాన్ విడిచి వెళ్లండి: భారత్

(మొదటిపేజీ తరువాయి)

లెబనాన్‌కు వెళ్లవద్దని కూడా సూచించింది. జాగ్రత్తగా ఉండాలని ఇప్పటికే లెబనాన్‌లో ఉన్న భారతీయులను విదేశాంగ శాఖ హెచ్చరించింది. అక్కడ భారతీయులు ఇ మెయిల్ ద్వారా లేదా ఎమర్జెన్సీ ఫోన్ నంబర్ 96176860128 ద్వారా బీరుట్‌లోని భారత రాయబార కార్యాలయంలోని అధికారులను సంప్రదించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ తెలిపింది. ఇజ్రాయిల్ సైన్యం దక్షిణ లెబనాన్, రాజధాని బీరుట్ లక్ష్యంగా దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం లెబనాన్‌లో మూడు వేల మంది భారతీయులు ఉన్నారు.

మా జోలికొస్తే అణ్వస్త్రాలు తీస్తాం

పశ్చిమ దేశాలకు రష్యా హెచ్చరిక: అణ్వాయుధాల విధానంలో మార్పు

మాస్కో: తమపై దాడులు చేసే దేశాలకు దీటైన బదులు ఇచ్చేందుకు అణ్వస్త్రాలు వినియోగించాలని రష్యా నిర్ణయించింది. ఇదే విషయమై పశ్చిమ దేశాలకు ఓ హెచ్చరిక చేసింది. తాజా నిర్ణయానికి అనుకూలంగా అణ్వాయుధాల విధానంలో మార్పులు చేసింది. దీని ప్రకారం వైమానిక దాడులు, క్రూజ్ క్షిపణులు, డ్రోన్లతో తమపై దాడులు చేస్తేగనుక అణ్వస్త్రాలు వినియోగించాలని నిర్ణయించినట్లు అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రష్యా భద్రతా మండలి సమావేశంలో స్పష్టంచేశారు. అణ్వస్త్రాలు లేని దేశం చేసే దాడికి మద్దతిస్తే రెండు దేశాలు కలిసి చేసినట్లుగానే పరిగణించి ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. తమపై దాడికి యత్నిస్తున్న దేశానికి అణుశక్తి కలిగిన దేశం సహకరిస్తుండటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని పుతిన్ అన్నారు. శత్రు దేశానికి సహాయం చేసే పశ్చిమ దేశాలను కట్టడి చేసే ఉద్దేశంతోనే అణ్వస్త్రాల విధానంలో మార్పులు చేసినట్లు వెల్లడించింది. అణ్వాయుధాలతోనే కాకుండా ఇతర మార్గాల్లోనూ తమపై దాడులు చేస్తే జరిగే పరిణామాల గురించి ఆ దేశాలకు ఇదొక హెచ్చరిక అవుతుందని క్రెమ్లిన్ తెలిపింది. సరిహద్దులో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో విధానంలో మార్పులు చేశామని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు. అయితే అణ్వాయుధాలు పెంచుకొనే ఉద్దేశం లేదన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం నేత వెంకట్రామిరెడ్డికి షోకాజ్ నోటీసు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డికి ప్రభుత్వం షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఆయనకు సాధారణ పరిపాలన శాఖ నోటీసులు ఇచ్చింది. ఏపీ సచివాలయ సంఘం గుర్తింపు రద్దు ఎందుకు చేయకూడదో తెలపాలంటూ జీఏడీ షోకాజ్ నోటీసు ఇచ్చింది. అయితే.. సంఘం అధ్యక్షుడిగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఉంటే ఆయనపైనే చర్యలు తీసుకోవాలని అప్సా ఆఫీసు బేరర్లు విజ్ఞప్తి చేశారు. ఒక వ్యక్తి గురించి సంస్థ గుర్తింపు రద్దు చేసే నిర్ణయం తీసుకోవద్దని ప్రభుత్వానికి అప్సా కార్యదర్శి కృష్ణ, ఇతర ప్రతినిధులు కోరారు. ఇదిలా ఉండగా... ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం నుంచి తప్పుకుంటున్నట్లు అప్సా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణ ప్రకటించారు.

కీచక వార్డెన్‌కు మరణ దండన

(మొదటిపేజీ తరువాయి)

బృందాన్ని ఏర్పాటు చేసింది. దాంతో వార్డెన్ అరాచకాలు బయటపడ్డాయి. 2014-22 మధ్యకాలంలో 21 మంది మైనర్లపై అతడు లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడినట్లు తేలింది. బాధితుల్లో ఆరుగురు బాలురు కూడా ఉన్నట్లు బయటపడింది. ఈ కేసుకు సంబంధించి గతేడాది జులైలో దాఖలు చేసిన చార్జిషీట్‌లో కీలక విషయాలు వెల్లడయ్యాయి. లైంగిక దాడికి పాల్పడేముందు బాధితులకు వార్డెన్ మత్తుమందు ఇచ్చేవాడు. ఈ విషయాలు బయటకు చెప్పకూడదని బెదిరింపులకు పాల్పడేవాడు. ఈ క్రమంలో ఆరుగురు బాధితులు ఆత్మహత్యకు కూడా ప్రయత్నించారు. వార్డెన్ ఆగడాలపై ఓ మహిళా టీచర్‌కు బాధిత చిన్నారులు చెప్పినప్పటికీ... పై అధికారుల దృష్టికి ఆమె తీసుకెళ్లలేదని దర్యాప్తులో తేలింది. విచారణ జరిపిన పోక్సో న్యాయస్థానం వార్డెన్‌కు మరణశిక్ష విధించగా.. మాజీ ప్రధానోపాధ్యాయుడితోపాటు మరో మహిళా టీచర్‌కు 20 ఏళ్ల చొప్పున జైలు శిక్ష విధించింది. 'కఠినమైన, ఆదర్శప్రాయమైన శిక్ష కోరుతూ మేము చేసిన అభ్యర్థనలను కోర్టు మన్నించి... మంచి తీర్పు ఇచ్చినందుకు మేము సంతోషిస్తున్నాము' అని పోక్సో ప్రత్యేక కోర్టులో బాధితుల తరపున హాజరైన న్యాయవాది ఓయామ్ బింగెప్ పేర్కొన్నారు.

ఇంటినుంచే పని!

(మొదటిపేజీ తరువాయి)

అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తిచేయాలన్నారు. నూతన క్రీడా విధానం రూపొందించాలని ఆదేశించారు. తిరుపతి, అమరావతి, వైజాగ్ ను క్రీడా హబ్ గా మార్చాల్సిన అవసరం ఉందని, ఈ మూడు ప్రాంతాల్లో అన్ని క్రీడల నిర్వహణకు సకల సౌకర్యాలు కల్పించాలన్నారు. గత ప్రభుత్వం నిలిపేసిన ప్రాజెక్ట్ గాంధీవ, ప్రాజెక్ట్ పాంచజన్య, ప్రాజెక్ట్ విజయ, దే బోర్డర్స్, స్పోర్ట్స్ నర్సరీస్ కార్యక్రమాలను పునరుద్ధరించాలని ఆదేశించారు. అన్ని స్టేడియాల్లో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేసుకోవాలన్నారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో క్రీడా అకాడమీల ఏర్పాటుకు స్థలాలు పొందిన వారితో సంప్రదింపులు జరిపి వెంటనే వాటి ఏర్పాటు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. వారు ఆసక్తి చూపకపోతే కేటాయించిన భూమిని వెనక్కి తీసుకోవాలన్నారు. క్రీడా నగరంగా అమరావతిని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని... ఇక్కడ అతిపెద్ద స్టేడియం నిర్మాణం చేపడతామని వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా చిన్న పాటి స్పోర్ట్స్ సెంటర్ లు ఏర్పాటు చేయాలన్నారు. సచివాలయంలో విధుల అనంతరం అధికారులు, ఉద్యోగులు కొద్దిసేపు ఆటలు ఆడుకునే అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్రంలో సాధ్యమైనంతమేర కలెక్టరేట్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో స్పోర్ట్స్ సెంటర్ లు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ గ్రౌండ్స్, యూనివర్సిటీ గ్రౌండ్స్, ప్రైవేట్ విద్యా సంస్థల గ్రౌండ్స్ ను సామాన్య ప్రజలకు నిర్దేశిత సమయం వరకు అందుబాటులోకి తేవాలన్నారు. తద్వారా ఆయా ప్రాంతాల ప్రజలు వ్యాయామం, ఆటలు ఆడుకునేందుకు అవకాశం కలుగుతుందని సీఎం పేర్కొన్నారు. ఈ సమీక్షలో మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కీలక పత్రాలు స్వాధీనం

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించారు. గత ప్రభుత్వంలో మద్యం బాటిల్ బేసిక్ ధర పెంచి కొందరు పెద్దలు అనుచిత లబ్ధిపొందారని సీఐడీ దర్యాప్తులో తేలింది. 90 శాతం ఆర్డర్లు కేవలం పది కంపెనీలకే ఇచ్చినట్లుగా గుర్తించింది. లభించిన మద్యం లావాదేవీలకు సంబంధించిన పత్రాలను ఫైనాన్షియల్ ఆడిటింగ్‌కు పంపి విశ్లేషణ చేయాలని సీఐడీ అధికారులు భావిస్తున్నారు. బినామీ మద్యం కంపెనీలపై ఇప్పటికే సీఐడీ కేసు నమోదు చేయగా... ఇందులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది జూన్‌లో వాసుదేవరెడ్డికి చెందిన హైదరాబాద్, మంగళగిరి సమీపంలోని నివాసాల్లో సీఐడీ అధికారులు తనిఖీలు జరిపారు.

బంగారం ధరకు రెక్కలు

(మొదటిపేజీ తరువాయి)

పెరిగినట్లు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. బుధవారం రూ.77,850 ఉన్న ధర గురువారానికి రూ.78,250కు చేరినట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. మరోవైపు వెండికీ డిమాండ్ ఉంది. కిలో ధర రూ.94వేల మార్కును చేరుకుంది. ధరలో పెంపుదల వెయ్యి రూపాయల మేర ఉంది. అంతర్జాతీయ కమోడిటీ ఎక్స్ఛేంజీలో ఔన్సు బంగారం 2701 డాలర్లు పలుకుతోంది.

ద్రవ్యోల్బణం కట్టడికి వడ్డీ రేట్లు పెంచుకుంటూ వచ్చిన కేంద్ర బ్యాంకులు ఇప్పుడు వృద్ధికి ఊతం ఇచ్చేందుకు వడ్డీ రేట్లు తగ్గిస్తున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్త కూడా బంగారం ధర పెంపునకు దోహదమైంది. ఈ కారణాలతో డిమాండ్ ఏర్పడిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లో సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ వెల్లడించారు. డాలరు ధర క్షీణించడం కూడా మరొక కారణమన్నారు.

ముంబైలో కుంభవృష్టి

స్తంభించిన మహానగరం... విద్యాసంస్థలకు సెలవు

ముంబై: దేశ ఆర్థిక రాజధాని, మహానగరం ముంబైలో కుండపోత వర్షాలు కురిశాయి. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వానలు నగరాన్ని అతలాకుతలం చేశాయి. రహదారులన్నీ జలమయమయ్యాయి. దీంతో ఎక్కడ చూసినా రవాణా స్తంభించింది. ముంబైలోని అనేక శివారు ప్రాంతాలలో బుధవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. ములుంద్, దాని పరిసరాల్లో భారీ వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. అంధేరిలో ఓ మహిళ మ్యాన్‌హోల్‌లో పడి మృతి చెందింది. సెర్చ్ ఆపరేషన్‌లో ఆమె మృతదేహాన్ని వెలికితీశారు. భారీ వర్షాల ప్రభావంతో బుధవారం రాత్రి కొన్ని విమానాలను దారి మళ్లించాల్సి వచ్చింది. ముంబై విమానాశ్రయంలో ప్రతికూల వాతావరణం కారణంగా హైదరాబాద్ నుంచి ముంబై వెళ్లిన ఓ విమానాన్ని తిరిగి వెనక్కి పంపారు. దిల్లీ నుంచి ముంబైకి వెళ్లాల్సిన మరో విమానాన్ని హైదరాబాద్‌కు మళ్లించారు. విమానయాన సంస్థలు స్పైస్‌జెట్, ఇండిగో, విస్తారా సంస్థలు తమ విమానాలను దారి మళ్లించినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రయాణికులకు వెల్లడించాయి.

'భారీ వర్షం కారణంగా ముంబైలో వాతావరణం అనుకూలించకపోవడంతో ముంబై విమానాశ్రయం నుంచి బయలుదేరే లేదా ఇక్కడికి వచ్చే విమానాలు ప్రభావితం కావొచ్చు. ప్రయాణికులు వారి విమాన స్టేటస్‌ను చెక్ చేసుకుంటూ ఉండాలి' అని స్పైస్‌జెట్ సూచన చేసింది. ఈ మేరకు ఎక్స్‌లో ప్రకటన విడుదల చేసింది. గురువారం కూడా భారీ వర్షాలు కురిసినట్లు భారత వాతావరణ విభాగం ముంబై కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. ముంబై పొరుగు జిల్లాలను అప్రమత్తం చేసింది. అత్యంత భారీ వర్షాలు కురవవచ్చని, ముంబై, థానే, రాయ్‌గఢ్, రత్నగిరి జిల్లాలకు తీవ్ర భారీ వర్షాల ముప్పు ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించింది. భారీ వర్షాలు, వరదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గురువారం నగరంలోని అన్ని స్కూళ్లు, కాలేజీలకు మహారాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది.

మత విద్వేషాలకు బీజేపీ వ్యూహం

లడ్డూ వివాదంపై శ్రీనివాసరావు

విశాలాంధ్ర-మచిలీపట్నం: రాష్ట్రంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి తమ స్థానాన్ని పటిష్టం చేసుకోవాలనే వ్యూహంతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పనిచేస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. తిరుమల లడ్డూ కల్తీ నెపంతో ఇందుకు ప్రయత్నిస్తున్నాయని దుయ్యబట్టారు. మతం వ్యక్తిగతమని, దీనిని ఏ పార్టీ శాసించలేదన్నారు. రాజకీయ స్వప్రయోజనాల కోసం దేవుడిని వాడుకోవడం సరి కాదన్నారు. లౌకిక పార్టీగా చెప్పుకునే తెలుగుదేశం పార్టీ మతవిద్వేషాలు రెచ్చగొట్టడం తగదన్నారు. శ్రీనివాసరావు గురువారం స్థానిక జి.కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. లడ్డూ వివాదానికి తెరతీసి ప్రజా సమస్యలు గాలికొదిలేసిందని, ప్రజలు మాత్రం ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. లడ్డూ కల్తీపై సిట్ దర్యాప్తు నివేదిక వచ్చే వరకు రాజకీయ పార్టీల నాయకులు సంయమనం పాటించాలని కోరారు. లడ్డూ వ్యవహారంలో ఏ పార్టీ... ఏ కులం అనేదానితో సంబంధం లేకుండా తప్పు చేసిన వారిని శిక్షించడం సముచితమని తెలిపారు. సిట్ దర్యాప్తు నిష్పాక్షికంగా జరుగుతుందని, ఇందుకు అధికార-విపక్షాలు సహకరిస్తాయని ఆకాంక్షించారు. ఉచిత ఇసుక గురించి మాట్లాడుతూ అది నామమాత్రమేనని శ్రీనివాసరావు అన్నారు.

గత ప్రభుత్వం మాదిరిగానే ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలిపోతోందని, ధరలు కూడా గతంలో కంటే ఎక్కువగా ఉన్నాయన్నారు. ఉచిత ఇసుక సరఫరా డిమాండ్‌తో అక్టోబరు 4న సీపీఎం అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వరరావు, నరసింహారావు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రతి తరగతికీ ఉపాధ్యాయుడు: లోకేశ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: రాబోయే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు విధానాన్ని అమలు చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. నగరంలోని ఎచ్చెర్ల వీధిలోని ఎలిమెంటరీ పాఠశాలను గురువారం మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి చదువు కొనసాగుతున్న తీరుపై వాకబు చేశారు. వర్క్ బుక్‌ను పరిశీలించి చేతిరాత బాగుందని కితాబిచ్చారు. రాష్ట్రంలోని అన్ని స్కూళ్లలో చేతిరాతను మెరుగు పరిచేందుకు కాపీ రైట్ బుక్స్ విధానాన్ని అమలుచేసే అంశాన్ని పరిశీలిస్తామని లోకేశ్ చెప్పారు. అనంతరం టీచర్లు, ఎంఈఓ, స్కూలు సిబ్బందితో మంత్రి సమావేశమయ్యారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. అటెండెన్స్, ఫలితాలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తంచేశారు. విద్యాప్రమాణాల మెరుగుదలకు కలెక్టర్ నుంచి టీచర్ వరకు భాగస్వామ్యం వహించాలని కోరారు. దేశంలోనే ఆదర్శంగా స్కూళ్లను తీర్చిదిద్దుతామని తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా ప్రణాళికాబద్ధంగా సంస్కరణలు అమలు చేస్తామని అన్నారు. మౌలిక సదుపాయాల వాస్తవ చిత్రాలను డ్యాష్ బోర్డులో అప్ లోడ్ చేయాలని ఎంఈఓను ఆదేశించారు. కాగా, సబ్జెక్టులవారీగా బోధనకు స్కూల్ అసిస్టెంట్లు తక్కువగా ఉన్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. మీడియాతో మాట్లాడుతూ ఎవరు తప్పు చేసినా ఉపేక్షించేది లేదన్నారు. ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్ అధికారులను సస్పెండ్ చేయడం జరిగిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో మూడు పథకాలు అమలు జరిగాయని, దీపావళి నుంచి ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేస్తామన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి ఉన్నారు.

నేతన్నల పొట్టగొడతారా?

- జేఆర్ సిల్క్స్ యాజమాన్యంపై నేతల ధ్వజం
- అవినీతి అక్రమాల నిగ్గు తేలుస్తామని హెచ్చరిక
- ఫ్యాక్టరీ వద్ద చేనేత కార్మికుల భారీ ధర్నా
- అడ్డుకున్న పోలీసులు... నాయకుల అరెస్ట్

విశాలాంధ్ర-ధర్మవరం: జేఆర్ సిల్క్స్ ఫ్యాక్టరీ అవినీతి అక్రమాల నిగ్గు తేలుస్తామని... చేనేతల పొట్ట కొట్టి పైశాచిక ఆనందంలో యాజమాన్యం ఉండడం సరైన పద్ధతి కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి. జగదీశ్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, కార్యదర్శి మాధవస్వామి, సీపీఎం చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీలూరి రుసుంగప్ప, శ్రీ సత్యసాయి జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ హెచ్చరించారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలం వేల్పుమడుగు క్రాస్ వద్ద గల జేఆర్ సిల్క్స్ ఫ్యాక్టరీ దగ్గర గురువారం చేనేత కార్మికులతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు. ఒక దశలో నాయకులందరూ కూడా ఫ్యాక్టరీ లోపలికి వెళ్లడానికి ముఖ ద్వారం వద్ద ఉన్న గేటును దాటుకుని వెళ్లేందుకు ప్రయత్నించగా డీఎస్పీ శ్రీనివాసులు అధ్వర్యంలో పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోలీసులు బలవంతంగా నాయకులను వ్యాన్లలో ఎక్కించి బత్తలపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా కార్మికులు పోలీసుల జులుం నశించాలి అంటూ పెద్దపెట్టున నినదించారు. అంతకుముందు చేనేత కార్మికులతో కలిసి ర్యాలీగా నేతలు ఫ్యాక్టరీ వద్దకు తరలివచ్చారు. ధర్నా సందర్భంగా నేతలు మాట్లాడుతూ... చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేస్తూ... నేతన్నల కడుపుకొట్టేందుకు జేఆర్ సిల్క్స్ యాజమాన్యం చేపడుతున్న చర్యల్ని తీవ్రంగా ఖండించారు. చేనేత రిజర్వేషన్ చట్టం అమలు చేయాలని, లేబర్ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జేఆర్ సిల్క్స్ యాజమాన్యం అవినీతి అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మిక సంఘాలు ఏకమయ్యాయని, స్థానికులకు పనులు కల్పించకుండా బీహారీలచే పనులు చేయించుకోవడంతోపాటు జట్టు మగ్గాలు వేసి స్థాయి మగ్గాల యాజమాన్యాలకు కూడా కంటగింపుగా మారినట్లు తెలిపారు. రాజకీయాలను అడ్డం పెట్టుకొని కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న జేఆర్ సిల్క్స్ యజమాని జింక రామాంజ

నేయులుతో అమీతుమీ తేల్చుకోవడానికి సన్నద్ధమైనట్లు తెలిపారు. దాదాపు 200 జట్టు స్పీడ్ మగ్గాలు వేసి చేనేత పరిశ్రమను పూర్తిగా తన ఆధీనంలో తీసుకొని ఏకఛత్రాధిపత్యం వహించాలన్న దుర్బుద్ధితో చేనేత వ్యవస్థను భ్రష్టు పట్టించడానికి ఏకమవుతున్నారని కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. స్థానిక చేనేత కార్మికులకు పనులు కల్పించకుండా స్వార్థంతో ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలను తెప్పించుకొని మగ్గాలు తయారు చేస్తున్నట్లు కార్మిక సంఘాలు చెబుతున్నాయన్నారు. అంతేకాకుండా తన ఫ్యాక్టరీకి ఓ కోటను నిర్మించి ఎవరిని రానీయకుండా కట్టుదిట్టం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవరైనా ఆ ఫ్యాక్టరీ వద్దకు వెళితే బౌన్సర్లతో దాడులు చేస్తున్నారని తెలిపారు. మార్కెట్ ధర కంటే 50 రూపాయలు తక్కువ ధరకు ఉత్పత్తులను అమ్మినప్పటికీ జేఆర్ సిల్క్స్ యాజమాన్యానికి లాభాలు ఉండే అవకాశం కూడా ఉందని తెలిపారు. మగ్గాలు ఇతరులు నేయడానికి వీలుండదని, అందుకు కారణం జే ఆర్ సిల్క్స్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను తమ గుప్పెట్లో పెట్టుకుని సబ్సిడీపై తక్కువ ధరకే యంత్రాలను కొనుగోలు చేయడం వల్ల పెట్టుబడి తగ్గడంతో పాటు చీరల ఉత్పత్తులు పెరగడంతో ధర తగ్గించినా కూడా అధిక లాభాలు ఆర్జించడానికి వీలవుతుందని తెలిపారు. ఇటువంటి పరిస్థితిలో అడ్డుకట్టు వేయకపోతే చేనేత పరిశ్రమమంతా ఒకరి చేతిలో వెళ్లే ప్రమాదం ఉందని వారు గుర్తు చేశారు. ఏళ్ల తరబడి చేనేతను నమ్ముకున్న కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారే ప్రమాదం ఉందని తెలిపారు. జే ఆర్ సిల్క్స్ ను అందులో జరుగుతున్న అవినీతి అక్రమాలకు ఎండగడుతూ వస్తున్న అక్కడి యాజమాన్యాలు అధికారుల లాలూచీ వల్ల ఏమీ

చేయలేని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. విచ్చలవిడిగా పవర్ రూమ్స్ ఏర్పాటు చేసి చేనేత పరిశ్రమను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కంపెనీ నుండి 200 రూమ్స్ జెట్ మగ్గాలు ఏర్పాటు చేయడం ద్వారా ఆ ప్రభావం చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తున్న జేఆర్ సిల్క్స్ ఫ్యాక్టరీపై యుద్ధభేరి మోగిస్తున్నట్లు నేతలు ప్రకటించారు. ఎన్ఫోర్స్‌మెంట్ జౌళి శాఖ అధికారులు యాజమాన్యం ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి వ్యవస్థనే నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. అదేవిధంగా ఎన్ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని ధర్మవరంలో ఏర్పాటు చేసేలా మంత్రులు సత్య కుమార్ యాదవ్, సవిత కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం నాయకులందరూ కూడా ఫ్యాక్టరీ లోపలికి వెళ్లడానికి ముఖ ద్వారం వద్ద ఉన్న గేటును దాటుకుని వెళ్లేందుకు ప్రయత్నించగా డీఎస్పీ శ్రీనివాసులు అధ్వర్యంలో పోలీసులు అడ్డుకొని బలవంతంగా నాయకులను అదుపులోకి తీసుకున్నారు. వారిని బత్తలపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా కార్మికులు పోలీసుల జులుం నశించాలి అంటూ పెద్దపెట్టున నినదించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి మధు, సీపీఎం పట్టణ కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు పోలా లక్ష్మీనారాయణ, వెంకటనారాయణ, వెంకటస్వామి, ఏఐటీయూసీ నాయకులు రమణ,

సీఐటీయూ నాయకులు జేవీ రమణ, ఎస్ హెచ్ బాషా, సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, బత్తలపల్లి మండల కార్యదర్శి వెంకటేష్, కుల్లాయప్ప, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు సకల రాజా తో పాటు అధిక సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

తిరుమల విద్యాసంస్థ రూ.1.52 కోట్ల విరాళం

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు కోటి రెండు లక్షల ఆరువందల రూపాయల చెక్కును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజయవాడలో అందజేశారు. తిరుమల విద్యాసంస్థల ఉద్యోగుల వేతనం నుండి రూ.25 లక్షల 49 వేల 628, విద్యార్థులు ఇచ్చిన రూ.76 లక్షల 50 వేల 972 మొత్తం కలిపి రూ.1,02,00,600 ఇచ్చినట్లు తిరుమలరావు తెలియజేశారు. ఇంతకుముందు తిరుమల యాజమాన్యం రూ.50 లక్షలు అందజేసిన విషయం విదితమే. దీనితో తిరుమల విద్యాసంస్థల నుండి ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేసిన మొత్తం రూ.కోటి 52 లక్షల 600 అయింది. దీనికి సహకరించిన విద్యార్థులకు, సిబ్బందికి, తల్లిదండ్రులకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెసిడెంట్ డైరెక్టర్లు కె.సత్యనారాయణ, యస్.సాయిరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు లక్ష విరాళం

విశాలాంధ్ర-సీతానగరం: విజయవాడ వరదబాధితులకు సీతానగరం మండల కేంద్రంలోని గూడెంవీధికి చెందిన దామినేని వెంకట భానుప్రసాద్ (పెద్దబ్బాయి), ఆయన సోదరులు, గూడెంవీధికి చెందిన టీడీపీ నాయకులు లక్ష రూపాయల విరాళాన్ని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు అందజేశారు. వారిని ఎంఎల్ఏ బోనెల అభినందించారు. నియోజకవర్గం నుండి దాతలు విరాళాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. దాతలు అందజేసిన విరాళాల మొత్తాన్ని ఒకేసారి నియోజకవర్గం తరపున ముఖ్యమంత్రికి అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడెంవీధికి చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకార్మిక సంఘం సభ్యత్వ రుసుం రూ.25 వేలు అందజేత

విశాలాంధ్ర-విశాఖ: చెన్నైలో అఖిల భారత మత్స్యకారుల సమాఖ్య (ఏఐటీయూసీ) జాతీయ సమితి సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి.రాజాకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సభ్యత్వ రుసుం రూ.25 వేలు సంఘం అధ్యక్షుడు నెయ్యల నాగభూషణరావు, ప్రధాన కార్యదర్శి నాగాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కలిసి గురువారం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయ సభ్యులు పి.పోతయ్య, నల్లయ్య, జి.లక్ష్మణరావు, సీహెచ్.కాసుబాబు, ప్రసాద్, నర్సింహమూర్తి, రాజగోపాల్, రంగనాథ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

చేతివృత్తిదారులకు బడ్జెట్‌లో
25 శాతం నిధులివ్వాలి: రామాంజనేయులు

విశాలాంధ్ర-నంద్యాల అర్బన్: చేతి వృత్తిదారులకు బడ్జెట్లో 25 శాతం నిధులు కేటాయించాలని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలను చేతి వృత్తుదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఐదు సెంట్లు, పట్టణాలలో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇల్లు కట్టించి ఇవ్వాలని, 50ఏళ్లు పైబడిన వారికి పింఛన్, సామాజిక దాడుల నుంచి రక్షణ కల్పించాలని రామాంజనేయులు డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం చేతి వృత్తిదారుల జిల్లా సమాఖ్య సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు వి.చిన్న సుబ్బయ్య అధ్యక్షతన జరిగింది. రామాంజనేయులు మాట్లాడుతూ చేతి వృత్తిదారులకు గౌరవప్రద జీవితం కల్పించాలని పాలకులను కోరారు. ఇందుకోసం బ్యాంకుల ద్వారా వడ్డీ లేకుండా రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు రుణాలివ్వాలని అన్నారు. ఇనాం భూములు కబ్జాలకు గురైనట్లు తెలిపారు. కొన్ని గ్రామాలలో రజకులు, నాయి బ్రాహ్మణులు, కుమ్మరి, మేదరి, చేనేతలు, గొర్రెల కాపరులు వంటి వృత్తుల్లో ఉన్న వారిపై దాడులు జరిగాయని, గ్రామాల నుంచి వెలి వేశారని రామాంజనేయులు ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ చేతివృత్తిదారులకు సీపీఐ అండ ఎల్లప్పుడు ఉంటుందన్నారు. సమావేశంలో చేతివృత్తుదారుల సంఘం జిల్లా కార్యదర్శి రామ్మోహన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

విట్‌లో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యపై సమగ్ర విచారణ

జాన్సన్‌బాబు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విట్‌లో బీటెక్ ద్వితీయసంవత్సరం చదువుతున్న విద్యార్థిని సాయి శ్రియ ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... విట్ అమరావతి ఏపీ విశ్వవిద్యాలయంలో ఆత్మహత్య చేసుకున్న సాయి శ్రియ మరణానికి గల పూర్తి వివరాలను వెల్లడించాలన్నారు. విట్ క్యాంపస్‌లోకి తల్లి దండ్రులు వెళ్లకుండా భద్రతా సిబ్బంది అడ్డుకోవడాన్ని ఆయన ఖండించారు. ఈనెల 17న హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని సాయిశ్రియ ఆత్మహత్య చేసుకోవడంపై అనేక అనుమానాలు వస్తున్నాయన్నారు. తల్లిదండ్రులు రాకముందే మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించడమేమిటని ప్రశ్నించారు. వైస్ ఛాన్సలర్‌ని కలవడానికి తల్లిదండ్రులు అక్కడకు వెళ్లగా...వారిని లోనికి రానీయకుండా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారని, తమ బిడ్డ ఏ విధంగా చనిపోయిందని అడగడానికి వీలు లేకుండా వారిని క్యాంపస్‌లోకి ప్రవేశించకుండా బయటకి పంపడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలపై సమగ్రంగా విచారించి దోషులను కఠినంగా శిక్షించాలని జాన్సన్ బాబు డిమాండ్ చేశారు.

వర్సిటీల అభివృద్ధికి నిధులు

జాన్సన్‌బాబు డిమాండ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన కేంద్ర విశ్వవిద్యాలయాల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాలకు స్థలం, సొంత భవనాలు, వసతుల కల్పనకు తోడు పోస్టుల భర్తీలో అలసత్వం, కోర్సులు పెంచడంలో కాలయాపన ఆక్షేపణీయమన్నారు. జాన్సన్ బాబు గురువారం స్థానిక ఎన్ ఆర్ దాసరి క్రాంతి భవన్‌లో విజయనగరంలో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ 49వ మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను చర్చించి... ఉద్యమాలకు సన్నద్ధమవడం కోసమే ఈ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో మూడు విశ్వవిద్యాలయాలు కేంద్ర సంస్థల స్వయం ప్రతిపత్తిగల 20 సంస్థలు వచ్చాయని చెప్పారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి వర్సిటీలకు సముచిత నిధులు సమకూర్చాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పందించాలని, కేంద్ర విద్యాశాఖతో చర్చించి పూర్తిస్థాయిలో నిధుల కేటాయింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని జాన్సన్‌బాబు కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి, నాయకులు పూర్ణ సాయి, జోగేంద్ర ప్రసాద్, సూర్య కిరణ్, భాను ప్రతాప్ పాల్గొన్నారు.

కోరుకొండ సైనిక్ స్కూల్ భేష్: వెంకయ్య

విశాలాంధ్ర-విజయనగరం రూరల్: విజయనగరం జిల్లాలో కోరుకొండలో రక్షణ శాఖ నిర్వహిస్తున్న సైనిక్ స్కూల్‌ను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సందర్శించారు. కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రితో కలిసి పాఠశాలలోని అన్ని విభాగాలకు వెళ్లారు. విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల్లో ఉన్న దేశభక్తి, క్రమశిక్షణను చూసి ఎంతో సంతోషించినట్లు వెంకయ్య అనంతరం చెప్పారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ పాఠశాల విద్యార్థులకు అభివృద్ధే లక్ష్యంగా బోధన అందించడం హర్షణీయమన్నారు. సైన్యంలో సేవలందించాలనుకునే ఈ విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణ అందుతోందని తెలిపారు. తొలుత వెంకయ్యనాయుడుకు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి స్వాగతం పలికారు. సైనిక పాఠశాలలో వెంకయ్య గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎంవీ సూర్యకళ, లైజనింగ్ అధికారి మురళీకృష్ణ, తహసీల్దార్ కూర్మనాధరావు పాల్గొన్నారు.

యువతకు మెరుగైన శిక్షణ

సీఎస్ ఆదేశం...
కేంద్ర ప్రాయోజిత పథకాలపై సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు, వాటి పురోగతిపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ... తమ శాఖపరిధిలో మొత్తం 22 కేంద్ర ప్రాయోజిత పథకాలకు గాను 2023-24లో రూ.13,366 కోట్లు, 2024-2025లో ఇప్పటి వరకూ రూ.7,899 కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. 2024-2025కు గాను పథకాల అమలునకు తన వాటాగా కేంద్ర ప్రభుత్వం రూ.8,340 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. పథకాలు విజయవంతంగా అమలు జరుగుతున్నట్లు వివరించారు. అనంతరం నైపుణ్య శిక్షణ విభాగానికి సంబంధించిన కార్యక్రమాలపై సీఎస్ సమీక్షిస్తూ... 2023-24, 2024-25లో ఇప్పటి వరకూ నిర్వహించిన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, అందుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు, వ్యయంపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ శిక్షణ కార్యక్రమాల్లో ఇప్పటివరకు కవర్ చేయని కార్యక్రమాలు ఏమైనా ఉంటే వాటిని కూడా రాష్ట్రంలో అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎస్ సూచించారు. ముఖ్యంగా నైపుణ్య శిక్షణ విభాగం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మెరుగైన శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ఇప్పటి వరకూ నిర్వహించిన శిక్షణకు సంబంధించి సవివర నివేదికను సమర్పించాలని సీఎస్ ఆదేశించారు. తదుపరి హోంశాఖకు సంబంధించి ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ... పోలీస్ బలగాల ఆధునీకరణ వంటి మూడు కేంద్ర ప్రాయోజిత పథకాలు అమలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని సీసీ కెమెరాలను రాష్ట్ర సచివాలయంలోనే రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థతో అనుసంధానించాలని సీఎస్ చెప్పారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ కార్యదర్శి జానకి, ఇంటెలిజెన్స్ ఐజీ పిహెచ్‌డీ రామకృష్ణ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: లోకేశ్

ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

విశాలాంధ్ర-విశాఖ సిటీ: విశాఖలో పర్యటిస్తున్న ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ రెండో రోజు గురువారం ఉదయం టీడీపీ జిల్లా కార్యాలయంలో "ప్రజాదర్బార్" నిర్వహించారు. ప్రజలు, ఉద్యోగ సంఘాలు మంత్రిని కలిసి తమ సమస్యలు విన్నవించారు. ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులపై హత్యలు, దాడులపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు విధానంలో డీఎంఈ, ఏపీవీవీపీ, డీపీహెచ్, ఎన్‌హెచ్ఎం విభాగాలలో పనిచేస్తున్న నర్సులను శాశ్వత ఉద్యోగులుగా చేయాలని, గ్రాస్ జీతం వంద శాతం అమలు చేయాలని, పరస్పర అంగీకార బదిలీలు అమలుచేయాలని, బీమా అందించాలని కోరారు. జర్నలిస్టులకు నాలుగు సెంట్లు చొప్పున ఉచితంగా ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు రూ.10 వేల పెన్షన్ సదుపాయం, కరోనాతో మృతి చెందిన వారికి పరిహారం తదితర సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి మండలం కోడూరులో ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో తమ తండ్రికి కేటాయించిన 5.22 ఎకరాల భూమిని వైసీపీ అండతో ఆక్రమించారని, విచారించి తగిన న్యాయం చేయాలని ఎస్.నాగమణి, జి.జయలక్ష్మి కోరారు. డీఎస్సీ 2008లో ఎంపికై నష్టపోయిన అభ్యర్థులకు తగిన న్యాయం చేయాలని ఏపీ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. రష్యాలో వైద్యవిద్య అభ్యసిస్తున్న తమ పిల్లలకు ఎన్టీఆర్ విదేశీ విద్యాదీవెన బీసీ ఓవర్ సీస్ స్కాలర్ షిప్ మంజూరు చేయాలని తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటిందనే నెపంతో గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని విస్తృత దళిత సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని, గత వైసీపీ ప్రభుత్వంలో దళితుల హత్యలు, దాడులపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ సుధాకర్ అంశం, వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన డ్రైవర్ సుబ్రహ్మణ్యం, కోడికత్తి శ్రీను, కిరణ్ కుమార్ హత్య వంటి కేసులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. భర్త చనిపోయిన తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయడంతో పాటు జీవనోపాధి కల్పించాలని విశాఖకు చెందిన గంటిపిల్లి నూకరత్నం విజ్ఞప్తి చేశారు. విజ్ఞప్తులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఎస్ఆర్ఎంతో రోడ్లు భవనాల శాఖ ఎంవోయూ

విశాలాంధ్ర-మంగళగిరి: రాష్ట్ర ప్రభుత్వ రోడ్లు భవనాల శాఖకు సమగ్ర సహకారాన్ని అందించేందుకు ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ముందుకొచ్చింది. ప్రభుత్వం చేపట్టే నాణ్యమైన రోడ్ల నిర్మాణం, కొత్త టెక్నాలజీ అభివృద్ధి... ఇందుకోసం వర్క్ షాప్ ల నిర్వహణ వంటి కీలక అంశాల్లో అవసరమైన సహకారమందించేందుకు యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం అంగీకరించింది. ఈ మేరకు రోడ్లు భవనాల శాఖతో ఎంవోయూ కుదుర్చుకుంది. గురువారం ఉదయం యూనివర్సిటీలో జరిగిన ఒప్పంద కార్యక్రమంలో ఏపీ రోడ్లు భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ ఛీఫ్ నయిముల్లా, స్టేట్ హైవేస్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి పాల్గొని ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. వర్సిటీ తరపున రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్ ఎంవోయూ పత్రాలపై సంతకం చేశారు. మూడేళ్ల పాటు ఎంవోయూ అమల్లో ఉంటుంది. ఇందులో భాగంగా ఆర్ అండ్ బీ విభాగంతో కలిసి ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన శాస్త్రీయ పరిశోధన, లేబొరేటరీ, ఫీల్డ్ ఇన్వెస్టిగేషన్స్ నిర్వహించడం జరుగుతుందని ఈఎన్‌సీ నయిముల్లా పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టే అన్ని రకాల రోడ్ల నిర్మాణం, కొత్త టెక్నాలజీ అభివృద్ధి, వర్క్ షాప్‌ల నిర్వహణ వంటి అంశాల్లో వర్సిటీ తరపున సమగ్ర సహకారాన్ని అందిస్తామని రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమకుమార్ పేర్కొన్నారు. అక్టోబరు 7న రాష్ట్ర ప్రభుత్వం తరపున తొలి వర్క్ షాప్‌ను ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించనున్నామని చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా, సివిల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ రవితేజ, డాక్టర్ ఉమామహేశ్ రావు, డాక్టర్ భగత్ సింగ్, డాక్టర్ హరీష్, డాక్టర్ ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

29న జీ తెలుగు సరిగమప మరో సీజన్ ప్రారంభం

విశాలాంధ్ర-కడప: జీ తెలుగు తన సరిగమప సీజన్-16 ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ ఈ నెల 29న సాయంత్రం 6 గంటలకు, అక్టోబర్ 6 నుండి ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు ప్రసారమవుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన గాయకులను ప్రోత్సహించే లక్ష్యంతో డ్యాన్సింగ్, సింగింగ్ షోలతో మట్టిలో మాణిక్యాలను జీ తెలుగు గుర్తిస్తుందన్నారు. ఇందులో భాగంగానే విజయవంతంగా 15 సీజన్లు పూర్తి చేసుకున్న సింగింగ్ షో 'స రి గ మ ప' కొత్త సీజన్ ప్రారంభం కానుందన్నారు. ఈ సీజన్‌లో గాయనీ గాయకులు విలేజ్ వోకల్స్, సిటీ క్లాసిక్స్, మెట్రో మెలోడీస్ అనే మూడు జట్లుగా పోటీపడతారన్నారు. ఈ జట్లకు మెంటర్లుగా రేవంత్, రమ్య బెహరా, అనుదీప్ దేవ్ వ్యవహరిస్తారన్నారు. ఈ సీజన్‌కు శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుండగా... సంగీత దర్శకుడు కోటి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, పాటల రచయిత కాసర్ల శ్యామ్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నారని, ఇది కచ్చితంగా విజయవంతమవుతుందని జీ తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ అనురాధ గూడూరు అన్నారు.

సంపాదకీయం

విదేశీ మెప్పుకోసం మోదీ పాట్లు

మోదీ హయాంలో అమలవుతున్న ప్రజాస్వామ్యానికి విదేశీ దౌత్యవేత్తల నుంచి మెచ్చుకోలు అవసరం కావడం మన ప్రజాస్వామ్య దుస్థితికే చిహ్నం. జమ్మూ-కశ్మీర్ లో పదేళ్ల తరవాత జరుగుతున్న శాసనసభ ఎన్నికలు లోపభూయిష్టంగా ఉన్నాయన్న అనుమానం మోదీ ప్రభుత్వానికే కలిగినట్టుంది. అందుకే కొన్ని దేశాల దౌత్య వేత్తలను పిలిపించి జమ్మూ-కశ్మీర్ శాసనసభ ఎన్నికల రెండో దశ పోలింగ్ ను చూసే అవకాశం కల్పించారు. ఇలాంటి సందర్భాలలో వచ్చిన అతిథులు వారికి చూపించినవి మాత్రమే చూడగలుగుతారు. తమ ఇష్టం వచ్చిన చోటికి వెళ్లి వాస్తవ పరిస్థితిని గమనించే వీలు వారికి చిక్కదు. తాము జమ్మూ-కశ్మీర్ ఎన్నికలు ఎలా జరుగుతున్నాయో చూడడానికి వచ్చామని, క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్య ప్రక్రియ పోకడలను గమనించామని ఆ దౌత్యవేత్తలు నోరారా పొగిడారు. ఇంకేముంది జమ్మూ-కశ్మీర్‌కు ఉన్న రాష్ట్ర ప్రతిపత్తిని లాగేసి, ఆ ప్రాంతాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చేసి, ఆ ప్రాంతానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణం రద్దు చేసిన అయిదేళ్ల కాలంలో అక్కడ అంతా సవ్యంగానే ఉందన్న సర్టిఫికేట్ మోదీ ప్రభుత్వం సంపాదించగలిగింది. ఎన్నికలు సవ్యంగా నిర్వహిస్తున్నట్టు, జమ్మూ-కశ్మీర్‌లో పరిస్థితి ప్రశాంతంగా ఉందని చాటి చెప్పుకోవడానికి మోదీ ప్రభుత్వం విదేశీ దౌత్యవేత్తలను ఆహ్వానించడానికి సిద్ధ పడింది కానీ విదేశీ పత్రికా రచయితలు ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వార్తలు సేకరించడానికి మాత్రం తలుపులు మూసేసింది. దీనితోనే మోదీ ప్రభుత్వం ఏదో దాస్తోందని అర్థం అవుతోంది. అమెరికా, మెక్సికో, గయానా, దక్షిణ కొరియా, సోమాలియా, పనామా, సింగపూర్, నైజీరియా, స్పెయిన్, దక్షిణాఫ్రికా, నార్వే, టాంజానియా, రువాండా, అల్జీరియా, ఫిలిప్పీన్స్ దేశాలకు చెందిన 15 మంది దౌత్య వేత్తలు పోలింగ్ జరిగిన 26 నియోజక వర్గాలలో ప్రభుత్వం తీసుకెళ్లిన చోటికల్లా వెళ్లి మన ప్రజాస్వామ్య ప్రక్రియను పరిశీలించారట. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇలా మన ఎన్నికల ప్రక్రియను పరిశీలించడానికి విదేశీ దౌత్యవేత్తలను ఆహ్వానించడం బహుశ: ఇదే మొదటి సారి. ఈ నెలాఖరులోగా జమ్మూ-కశ్మీర్ లో ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించి ఉండకపోతే శాసనసభ ఎన్నికలు కూడా నిర్వహించేది కాదేమో! సింగపూర్‌కు చెందిన దౌత్యవేత్త అలైస్ చైన్ ఇంతకు ముందు కూడా తాను కశ్మీర్ సందర్శించానని, కానీ ఇప్పుడు పోలింగ్ ప్రక్రియను పరిశీలించే అవకాశం వచ్చిందని అన్నారు. ఎన్నికలు పండగలా జరుగుతున్నాయని, సింగపూర్ లో కూడా ఇలాంటి దృశ్యాలు చూడలేదని ఆమె అన్నారు. ఎన్నికల ప్రక్రియను పరిశీలించడానికి విదేశీ దౌత్యవేత్తలకు అవకాశం ఇవ్వడం ఇది మొదటిసారి కావొచ్చు. కానీ 2019 ఆగస్టు 5న 370వ అధికరణాన్ని రద్దు చేసిన తరవాత 2020 జనవరి 9న కూడా 15 మంది విదేశీ రాజకీయ నాయకులు కశ్మీర్ లో పర్యటించారు. జి-20 సమావేశాలు జరిగినప్పుడు కూడా విదేశీ ప్రతినిధి వర్గం శ్రీనగర్ లో పర్యటించింది.

తాము ఆహ్వానించిన విదేశీ దౌత్యవేత్తలు ఎన్నికల ప్రక్రియకు "సాక్షులే" తప్ప "పరిశీలకులు" కారని విదేశాంగ మంత్రిత్వ శాఖ వివరణ ఇచ్చుకుంది. అయితే ఈ దౌత్యవేత్తల అభిప్రాయం ఏమిటో మాత్రం ఇదమిత్థంగా తెలియదు. భద్రతా కారణాలవల్ల ఆ వివరాలు బయటపెట్టడంలేదట. అక్టోబర్ ఒకటవ తేదీన జరిగే తుది దశ పోలింగ్‌ను గమనించడానికి కూడా మరోసారి విదేశీ దౌత్యవేత్తలను ఆహ్వానిస్తారట. జమ్మూ-కశ్మీర్ ఎన్నికల ప్రక్రియను చూసే అవకాశం దౌత్యవేత్తలకు ఇచ్చినప్పుడు ఇతర దేశాల పత్రికా రచయితలకు ఆ అవకాశం ఎందుకు ఇవ్వలేదు అని ప్రతిపక్షాలు ప్రశ్నించడంలో అనౌచిత్యం లేదు. కశ్మీర్ పరిస్థితి మీదే కాకుండా మన దేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియలో లోపాలను విదేశీ వ్యవస్థలో, పత్రికల్లో ఎత్తి చూపినప్పుడు అది మన దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని ప్రభుత్వం నానా యాగీ చేస్తుంది. ప్రభుత్వమే విదేశీ దౌత్యవేత్తలను ఆహ్వానించి ఎన్నికల ప్రక్రియను గమనించే అవకాశం ఇవ్వడం వారు మన అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి వీలు కల్పించినట్టు కాదా అన్న ప్రశ్నకు సమాధానం ఇచ్చే వారు మోదీ ప్రభుత్వంలో ఎవరూ ఉండరు. మన వ్యవహారాల్లో ఇతర దేశాలవారు జోక్యం చేసుకోకూడదనుకున్నప్పుడు దౌత్యవేత్తలను ఆహ్వానించడంలో ఆంతర్యం ఏమిటో అంతుపట్టదు. చూశారా కశ్మీర్ ఎన్నికల నిర్వహణా తీరును విదేశీ దౌత్య ప్రతినిధులు కూడా మెచ్చుకున్నారు అని మోదీ ప్రభుత్వం తన వీపు తాను చరుచుకోవడాన్ని మించిన ప్రయోజనం ఏమీ ఉండదు. జమ్మూ-కశ్మీర్ లో గత అయిదేళ్ల కాలంలో ప్రజాస్వామ్య ప్రక్రియ పూర్తిగా స్తంభింప చేశారు. అక్కడి ప్రజలను నోరెత్తనీయలేదు. ప్రధాన ప్రతిపక్షాలు రాజకీయ కార్యకలాపాలు నిర్వహించే అవకాశమూ లేకుండా చేశారు. ఇటీవల జరిగిన లోకసభ ఎన్నికలలోనూ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్న మాట నిజమే. లోకసభ ఎన్నికలనుగానీ, ఇప్పుడు జరుగుతున్న శాసనసభ ఎన్నికలనుగానీ బహిష్కరించాలని కశ్మీర్‌లోని ఏ రాజకీయ పక్షం లేదా తీవ్రవాద సంస్థ పిలుపు ఇవ్వలేదు. అందుకే ఓటర్లలో ఉత్సాహం కనిపించింది. రాష్ట్ర ప్రతిపత్తి కోల్పోయి, 370వ అధికరణం రద్దు చేసిన తరవాత జరిగిన ఎన్నికలలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడానికి కారణం అక్కడ సంపూర్ణ ప్రశాంతత నెలకొన్నదని కాదు. తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి ప్రజలు ఎన్నికలను ఒక అవకాశంగా భావించారు. అంతే. ఇందులో మోదీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడానికి ఏమీ లేదు. తమను నోరు విప్పనివ్వడం లేదని ప్రజలు ఇప్పటికీ హీనస్వరంలో ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. గత అయిదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం జమ్మూ-కశ్మీర్ ప్రజల నోళ్లకు తాళం వేసేసింది. విధిలేక సుప్రీంకోర్టు ఒత్తిడివల్ల ఇప్పుడు ఎన్నికలు నిర్వహించక తప్పలేదు. జమ్మూ-కశ్మీర్ కు రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరిస్తామని ఇంతకు ముందు మోదీ సర్కారు ఇచ్చిన హామీ ఊసే ఇప్పుడు ఎత్తడం లేదు. ఈ ఎన్నికలలో ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణనే ప్రధానాంశం చేశాయి. పరిపాలనా సౌలభ్యం కోసం పెద్ద రాష్ట్రాలను చిన్న చిన్న రాష్ట్రాలుగా విడగొట్టిన సందర్భాలు ఉన్నాయి. తమ ప్రాంతం అభివృద్ధి చెందలేదని ప్రజలు ఉద్యమించినప్పుడు ప్రత్యేక రాష్ట్రాలను ఏర్పాటు చేసిన ఉదంతాలున్నాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేసిన సందర్భాలూ ఉన్నాయి. కానీ రాష్ట్రంగా ఉన్న ప్రాంతాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొట్టిన చోద్యం మోదీ హయాంలోనే కనిపించింది. అయిదేళ్ల కింద కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు ప్రజలు ఆమోద ముద్ర వేస్తారో లేదో ఎన్నికల ఫలితాలు వెలువడిన తరవాత కూడా కొంత మేరకే తెలుస్తుంది. ఇటీవలి లోకసభ ఎన్నికలను, ఇప్పుడు శాసనసభ ఎన్నికలను జమ్మూ-కశ్మీర్ ప్రజలు ఊపిరి పీల్చుకోవడానికి వచ్చిన అవకాశంగా భావిస్తున్నట్టున్నారు. ఇందులో ప్రభుత్వం స్వోత్కర్షలకు పోవాల్సిన అగత్యమే లేదు. విదేశీ దౌత్యవేత్తలచేత ఆమోద ముద్ర వేయించుకోవలసిన అవసరం అంతకన్నా లేదు. ఎన్నికలు నిర్వహించి ప్రభుత్వం తన కర్తవ్యాన్ని నిర్వహించిందే తప్ప అద్భుతం ఏమీ చేయలేదు.

దేవుడూ నిద్రలే!

నిద్రలే స్వామీ ఇక చాల్లే లేవయ్యా నీ పేరుతో బురద చల్లుతుంటే చూడలేని స్వామీ మేలుకోవయ్యా పరమేశ్వరా! ఏడుకొండలవాడ. ఏంటి బావ దేవుడినే నిద్రలేపుతున్నావ్ ఏంటి కథ. అదేమరి అన్నీ తెలిసి తెలియనట్లు అడుగుతావ్. గత వారంరోజులుగా ఊరూవాడా అన్ని పేపర్లలోను, అందరి నోట తిరుపతి లడ్డూ వూసే కదా! అదా అసలు ఆ దేవదేవుడు అన్నీ చూస్తూనే ఉన్నాడు. ఎప్పుడు కళ్లు తెరవాలో అప్పుడే తెరుస్తాడు. సమాజంలో జరిగే ప్రతి చర్యకు ఆ దేవుడు సాక్షీభూతుడు మాత్రమే. ఈ జన్మలో జరిగే మంచి, చెడులకు ఆయనే సాక్షి. మరుజన్మలో ఈ జన్మ కర్మ ఫలితం అనుభవించక తప్పదు. అది సరేనయ్యా అసలు నెయ్యిలో కల్తీ ఉందో లేదో తేల్చకముందే ఒకర్ని ఒకరు తిట్టుకోవడం, ఇళ్లమీద, కార్యాలయాల మీద పడి రాళ్లు రువ్వుకోవడం ఆశ్చర్యంగా ఉంది. అయినా స్వయానా ముఖ్యమంత్రి తెలుస్తోంది, విచారించాలి అనకుండా జంతువుల నూనె కల్సిందని చెప్పడంతో ఒక్కసారిగా భగ్గుమంది. విచారణకు ఆదేశించి ఫలితం వెలువడ్డాక జరగవలసిన రాద్ధాంతం ముందుగానే జరగడం ఘోరం. అసలు జులై నెలలో ఈ విషయం బయటపడితే యిప్పటి వరకు ఎందుకు దాచినట్లు? ఏదిఏమైనా ప్రతిదానికి రాజకీయరంగు



పులమటం, మత విద్వేషాలు రెచ్చగొట్టడం మంచిది కాదు. ఒక పెద్దమనిషి ఈ ఘోరం గత అయిదు సంవత్సరాలుగా జరుగుతోందని అంటాడు. కాని ప్రతి మూడునెలలకు పరీక్ష చేసిన తరువాతనే కొనేటప్పుడు అయిదేళ్లు ఎలా వూరుకున్నారు? ఆ పెద్దమనిషి ఆనాడే ఈ విషయం బయటపెట్టవచ్చు కదా! ఏదిఏమైనా కోట్లాది భక్తుల మనోభావాలకు తీరని విఘాతమే ఈ కల్తీ లడ్డు. కాని ఈ విషయాన్ని రాజకీయాలకు వాడుకోవడం మంచిది కాదు. అది సరే బావ ఈ విషయంలో బీజేపీ అగ్ర నాయకుల ప్రమేయం ఉందంటావా. గత కొంతకాలంగా బీజేపీపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని చెప్పడానికి 2024 లోక్‌సభ ఎన్నికలలో నిరూపణ జరిగింది. అయిదేళ్లు గడిచిన తరువాత మరింత వ్యతిరేకత పెరుగుతుందనే భయంతోనే 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనేది పార్లమెంటులో బిల్లు ఆమోదింపచేయించుకుంది. అది అమలు సాధ్యాసాధ్యాలు పక్కన పెడితే తగ్గిపోతున్న గ్రాఫ్ దృష్టిలో ఉంచుకుని ముందస్తు ఎన్నికలకు తొందరపడుతోందని ఎక్కువమంది భావిస్తున్నారు. అందుకే హిందువుల నుంచి సానుభూతి కోసం కేంద్రం ఈ నాటకంలో భాగస్వామిగా ఉందని కొందరి అభిప్రాయం. అయినా దేశంలో యిన్ని నేరాలు, ఘోరాలు జరుగుతుంటే ఆ ఏడుకొండల వాడు నిద్రపోతుంటే ఎలా చెప్పు? ఈ అన్యాయాన్ని అరికట్టే దేశం శాంతిగా మనుగడ సాగించడం ఆయనకు యిష్టం ఉండదా! దేశ దేశాల నుంచి కోట్లాది మంది ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి దర్శనం చేసుకుని మనసు ప్రక్షాళన చేసుకుని ఆ దేవ దేవుని పేరిట అమ్మే లడ్డు మహాప్రసాదంగా స్వీకరిస్తుంటే అందులో కల్తీని అరికట్టి అందుకు బాధ్యుల్ని సర్వనాశనం చేయవచ్చు కదా. నిరాకారుడంటారు. అంటే మంచివాళ్లకు మంచివాడుగా చెడ్డవాళ్లకు చెడ్డవాడుగా వివిధ రూపాలలో దర్శనమిచ్చే ఈ స్వామి ఈ భూమ్మీద జరిగే అరాచకాలకు సాక్షిభూతుడు మాత్రమే అంటే ఎట్లా? ఇలా కులమతాలతో రాజకీయ విభేదాలతో నిత్యం అశాంతితో బతకటం ఆయనకు యిష్టమా! ఈ మధ్య జల ప్రళయంలో వూహించరాని విధ్వంసం సృష్టించారు. ఇంతవరకు కోలుకోలేదు. ఇంతలోనే ఈ లడ్డు వ్యవహారమేమిటి స్వామీ! ఇది నీకు న్యాయమా? ఇప్పటికైనా కళ్లు తెరువు స్వామీ? నిత్యం నిన్ను కొలిచే కోట్లాది భక్తులు ఈ లడ్డు విషయంతో తల్లడిల్లిపోతున్నారు. వారిపై దయ చూపించి అసలు దొంగల నిజస్వరూపం బయటపెట్టు స్వామి. కొందరు సుప్రీంకోర్టుకు వెళ్లారు. న్యాయమూర్తులు కూడా నీ భక్తులే కదా! పోనీ వారి నోటితోనైనా అసలు దొంగల్ని బయటపెట్టి నీ భక్తుల హృదయ వేదనకు స్వస్తి పలుకు స్వామి. కల్తీ లడ్డు అంటారు ముఖ్యమంత్రి-ఆయన కుమారుడేమో కల్తీ ఉన్న వాటిని వెనక్కి పంపించారని అంటారు. దేశంలో ఉన్న సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే అవి చాలవన్నట్లు ఈ లడ్డు గోల ఎందుకు స్వామి! అసలే వరదలతో కోలుకోలేని స్థితిలో ఉన్న బాధితులకు ఈ కొత్త గోల ఎందుకు స్వామి! నిరాకారుడు, నిర్వికల్పుడు, నిర్గుణుడు అంటారు నిన్ను. ఒకే ఆకారంలో ఉండవని, నీకంటూ కోరికలుండవని అలాగే ఎల్లప్పుడు ఒకే గుణంతో ఉండవని అంటారు. భక్తుల రక్షణ కోసం ప్రహ్లాదుడిని రక్షించడానికి అవతారం మార్చినట్లు ఈ కల్తీ లడ్డు కారకులను అంతమొందించడానికి కొత్త అవతారం దాలుచ స్వామి. ఏమో ఏం చేస్తారో మాకు తెలియదు. మీ భక్తుల మనోవేదనకు స్వస్తి పలుకుతావని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నాం. త్వరలో అంతం పలుకు స్వామి.

సెల్: 9885569394

లక్ష్యం చేరని మేక్ ఇన్ ఇండియా

డా.జ్ఞాన్‌పాఠక్

తయారీ రంగంపై దృష్టి కేంద్రీకరించే దిశగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం పది సంవత్సరాలు పూర్తి చేసుకుంది. భారత్‌ను అంతర్జాతీయ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయడమే దీని ఉద్దేశం. భారత్‌కు వచ్చి ఉత్పత్తులు చేపట్టాలని ఈ కార్యక్రమం ద్వారా ప్రధాని మోడీ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. అయితే 2014 సెప్టెంబరులో చేపట్టిన ఈ కార్యక్రమం గత దశాబ్ద కాలంలో విఫలమైంది. లక్ష్యానికి చాలా దూరంగా ఉంది. అనుకూలంగా ఉన్న అంతర్జాతీయ పరిస్థితులను కూడా తనకు అనుకూలంగా మలుచుకోలేకపోయింది. తయారీ రంగంలో పెట్టుబడులను పెంచలేకపోయింది. దేశంలో సరళతరమైన వాణజ్యం పెంపుదలకు మేకిన్ ఇండియా పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ విషయంలో విఫలమైంది.సరళతరమైన వాణిజ్య కేంద్రంగా దేశాన్ని అభివృద్ధి చేస్తానని ప్రధాని మోదీ ప్రకటించినప్పటికీ అది ఇంతవరకు నెరవేరలేదు. దేశంలో సరళతర వాణిజ్యం కిందకు అనేక పథకాలను ప్రవేశపెట్టారు. వివిధ రకాల చొరవలను సమన్వయపరచి పెంపొందిచడానికి పరిశ్రమల ఇంటర్నల్ ట్రేడ్ ప్రమోషన్ డిపార్ట్‌మెంట్‌ను (డీపీఐఐటీ) నోడల్ డిపార్టుమెంటుగా ఏర్పాటు చేశారు. ఇది కొన్ని ఫలితాలను సాధించింది. ప్రపంచ బ్యాంకు వాణిజ్య నివేదిక (డీబీఆర్) ప్రకారం ఇండియా రాంక్ పెరిగింది. 2014లో సరళతర వాణిజ్యంలో 142వ ర్యాంక్‌కు భారతదేశం చేరింది. అనంతరం స్వల్పంగా పెరుగుతూ వచ్చినప్పటికీ లక్ష్యసాధనకు దూరంగా ఉండిపోయింది.

2014-15లో విదేశీ పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) 45.15 బిలియన్లు ఉండగా, 2019-20 నాటికి 74.39బిలియన్ల డాలర్లకు చేరింది. సరళతర వాణిజ్యాన్ని పెంపొందించడానికి అనేక చర్యలు తీసుకున్నది. సులభతరం, ఇప్పుడున్న కార్యక్రమం నియంత్రణ, వాణిజ్యం ప్రారంభంలో సంస్కరణలు, పన్నుల చెల్లింపు, ఇతర దేశాలలో వాణిజ్యం, దివాలాను పరిష్కరించడం లాంటి చర్యలు తీసుకున్నది.

పెట్టుబడులు పెట్టగలిగినవారిని గుర్తించి తగిన సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తూనేఉంది. ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అనేక ఈవెంట్లను నిర్వహిస్తున్నాయి. అలాగే రోడ్‌షోలు, ఇతర కార్యకలాపాలను మేకిన్ ఇండియా పథకం కింద నిర్వహిస్తున్నారు. ఎఫ్‌డీఐలను పెంపొందించడానికి ప్రభుత్వం

అనేక చర్యలు చేపట్టింది. అయినప్పటికీ మేకిన్ ఇండియా పథకాలు పెద్దగా వృద్ధి చెందలేదు. వివిధ మంత్రిత్వశాఖల పరిధిలో జీఎస్‌టీ, ఆర్థిక మార్కెట్‌లలో సంస్కరణలు, ప్రభుత్వరంగ బ్యాంకులలో చర్యలు, నాలుగు కార్మిక కోడ్‌ల ఏర్పాటు, వివిధ రంగాలలో సంస్కరణలు తదితర చర్యలు ప్రభుత్వం చేపట్టింది. కోవిడ్-19 సంక్షోభం తలెత్తిన కాలంలో ఇవన్నీ ఎందుకు ఉపయోగపడలేదు. అప్పుడు ఉత్పత్తి అనుసంధాన పథకాలు, ఆత్మనిర్భర్ ప్యాకేజీల కింద ప్రవేశపెట్టారు. సింగిల్ విండో వ్యవస్థ తదితరాలను ప్రభుత్వం ప్రారంభించినప్పటికీ ఎఫ్‌డీఐలు పెద్దగా పెరగలేదు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 81.97 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు మాత్రమే దేశంలోకి వచ్చాయి. 2022 సెప్టెంబరు నాటికి విదేశీ పెట్టుబడులు అత్యంత తక్కువగా వచ్చాయి. ప్రభుత్వం మాత్రం మేకిన్ ఇండియా మంచి ఫలితాలను తెచ్చిపెట్టిందని బొంకుతోంది. ఏ మాత్రం నిజంలేని ఈ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఆర్థికవృద్ధి పెంపొందించాలని ప్రభుత్వం తలపెట్టింది. ఈ మార్గంలో యువతకు భారీగా ఉద్యోగాలు సృష్టిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ అది ఏమాత్రం సాధ్యంకాలేదు. విదేశీ పెట్టుబడులు 2021-22 నాటికి కేవలం 83.57 బిలియన్ డాలర్లకు మాత్రమే చేరింది. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విదేశీ పెట్టుబడులు రానేలేదు. విదేశీ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు భారంగా తయారవుతున్నాయని భావించాయి.

> **2014 సెప్టెంబరులో చేపట్టిన ఈ కార్యక్రమం గత దశాబ్ద కాలంలో విఫలమైంది. లక్ష్యానికి చాలా దూరంగా ఉంది. అనుకూలంగా ఉన్న అంతర్జాతీయ పరిస్థితులను కూడా తనకు అనుకూలంగా మలుచుకోలేకపోయింది. తయారీ రంగంలో పెట్టుబడులను పెంచలేకపోయింది. దేశంలో సరళతరమైన వాణజ్యం పెంపుదలకు మేకిన్ ఇండియా పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ విషయంలో విఫలమైంది.సరళతరమైన వాణిజ్య కేంద్రంగా దేశాన్ని అభివృద్ధి చేస్తానని ప్రధాని మోదీ ప్రకటించినప్పటికీ అది ఇంతవరకు నెరవేరలేదు.**

కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్‌గోయెల్ మాట్లాడుతూ, మేడిన్ ఇండియా పథకం కింద మరో మూడువందల న్యాయపరమైన అంశాలను, ఉత్పత్తి రంగాలను మరింతగా పెంపొందించడానికి జనవిశ్వాస్ 2.10 పథకాన్ని ప్రవేశపెట్టినట్టు చెప్పారు. విద్యుత్, ఇంటర్నెట్, తరచుగా ఆగిపోతున్నాయి. హింసాకాండ పెరగడం, ఇంటర్నెట్ తరచుగా నిలిపివేయడం, హింసాకాండ పెరగకుండా ఇంటర్నెట్ సౌకర్యాన్ని నిలిపివేయడం, ఆన్‌లైన్ పరీక్షాపత్రాలలో ప్రశ్నలు లీకవడం, పరిశ్రమలు, మార్కెట్ల మూసివేత తదితర ఆటంకాలు ఉత్పత్తిని పెరగకుండా చేస్తున్నాయి. తగిన చట్టాలను తీసుకురావడం, వాటిని న్యాయంగా అమలుచేయడం తదితర కార్యక్రమాలను అమలుచేయడం పాలకవర్గాల బాధ్యత. ఈ విషయంలో ప్రతిపక్షాలుచేస్తున్న డిమాండ్‌లను ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకపోవడం కూడా మేకిన్ ఇండియా లాంటి పథకాలు వృద్ధి చెందడం లేదు. నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చేముందు ట్రేడ్ యూనియన్లతో అవసరమైన విధంగా చర్చలు జరపలేదు. మేలైన పారిశ్రామిక సంబంధాలు, శాంతియుతమైన సామాజిక వాతావరణం ఉన్నట్లయితే దేశంలో అభివృద్ధి వేగంగా జరుగుతుంది. ఇందుకు భిన్నంగా జరుగుతున్నప్పుడు వాణిజ్యం, పరిశ్రమలు దెబ్బతింటాయి. కార్మికవర్గానికి సామాజిక భద్రత లేనప్పుడు సామాన్య ప్రజలు ఏ విషయంలోనూ విజయం సాధించలేరు. సరళతర వాణిజ్యం కేవలం లాభాలను సంపాదించడానికి మాత్రమేకాదు, ఇందులో సామాజిక భద్రత, మానవ సంక్షేమ కార్యకలాపాలు ఉన్నప్పుడే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది.

వంద రోజుల పాలనలో కార్మికులకు సున్నా

ఎస్. వెంకటసుబ్బయ్య

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు దాటింది. ఈ వంద రోజుల పాలనలో అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నాం. ఇది మంచి ప్రభుత్వం అని ఇక నుంచి కూడా ప్రజల ఆకాంక్షలకు, అవసరాలకు, అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇస్తున్నారు. కాని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మరిచిపోయారనిపిస్తోంది కేవలం వృద్ధాప్య పింఛను పెంపు, అన్న క్యాంటిన్లు, మెగా డీఎస్సీ, ల్యాండ్‌సీలింగ్ యాక్టు రద్దుతో సరిపెట్టుకుంటే లాభంలేదు. ఇటీవల విజయవాడ నగరం, చుట్టుపక్కల ప్రాంతాలలో వచ్చిన వరదల్లో బాధితులను ఆదుకోవడంలో యుద్ధం చేశామని చెప్పడం మంచిదే కాని విజయవాడలో, రాష్ట్రంలోని అన్నిప్రాంతాలు, అన్ని రంగాల ప్రజలను ఇదే పద్ధతిలో చూసుకోవాలి.

ముఖ్యంగా రాష్ట్రంలో లక్షాలాది మంది ఉన్న అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి. ఈ 100 రోజులు వేలమంది అసంఘటిత కార్మికులు వారి వారి సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ని, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ని కలిసి వారి సమస్యలు విన్నవించారు. అయినా ఈ రంగాల వారి ఒక్క సమస్య కూడా నేరవేరలేదు కేవలం వారితో దిగిన ఫోటోలు మాత్రమే మిగిలాయి. ఎందుకంటే ఇటీవల కొందరు పేద మహిళలు లోకేశ్ ఇంటివద్ద తెల్లవారు జామున 4 గంటలకు క్యూలో ఉన్నారు. వీరంతా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే స్వీపర్లు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే మా ప్రభుత్వం వచ్చింది మీరు పనిమానుకోండి అంటూ గ్రామాలల్లో రాజకీయ వేధింపులుచేస్తూ అనేక మందిని తొలగిస్తున్నారు. దీనితో విద్యాశాఖ మంత్రి వద్ద తమ గోడువెళ్లబోసుకునేందుకు వారంతా. లోకేశ్ ఇంటికి వచ్చారు. అయినా ప్రయోజనం మాత్రం శూన్యం, మెడికల్ కాంట్రాక్టు కార్మికులు తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన స్పందనలో ఆ రోజు అందుబాటులో ఉన్న అర్లగడ్డ వెంకట్రావుకి వినతిపత్రం అందజేశారు.

వారికి రావాల్సిన 8 నెలలు వేతనాలు రాలేదు దీనిపైన ఏ మాత్రం స్పందన లేదు. విద్యుత్ రంగంలోని మీటరు రీడర్లు, షిఫ్టు ఆపరేటర్లు వారి న్యాయమైన కోర్కెలపై మెమోరాండం సమర్పించారు. దీనిపై ఇంత వరకు అతీగతిలేదు. సచివాలయ ఎనర్జీ అసిటెంట్లు వారి కోరికలు విన్నవించారు వాటిపైనా స్పందన కరువే. ముఖ్యంగా గత ప్రభుత్వ హయం చివరిలో అంగన్వాడి టీచర్లు, ఆయాలు 1 లక్ష ఆరువేల మంది 42 రోజులు వీరోచిత సమ్మెపోరాటం కొనసాగించారు. అ సమ్మెను అణచడానికి జగన్ ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించి బెదిరించింది. అయినా అంగన్వాడి టీచర్లు భయపడలేదు. చివరికి ప్రభుత్వం దిగివచ్చి చర్చలు జరిపి జులై 2024 నుంచి జీతాలుపెంచి ఇస్తామని ఆనాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమక్షంలో అంగీకరించారు. అనాడు అంగన్వాడిల పోరాటానికి తెలుగుదేశంపార్టీ పూర్తి మద్దతు ఇచ్చింది. కాని ఇప్పుడు అధికారంలోకి రాగానే ఆ సమస్యలు పరిష్కరించడానికి ముందుకు రాలేదు. ఈ సమస్యపై అనేకసార్లు అధికారులను, నారా లోకేశ్‌ను కలిసినా ప్రయోజనంలేదు. ఆశా కార్మికుల సమస్యలు, వేధింపులు ఎక్కువ అయ్యాయి. వారి గోడు వినే నాధుడే లేదు. వీరికి అనేక రకాల యాప్‌లు పెట్టి పనిభారం పెంచారు. పని వత్తిడి తగ్గించి రాజకీయ వేధింపులు ఆపాలని అనేక దఫాలు ప్రభుత్వాన్ని కోరినా ఫలితంలేదు. అసంఘటిత రంగంలో కీలకమైనది భవన నిర్మాణ రంగం.

ఈ రంగంలో రాష్ట్రంలో 50 లక్షల మంది ప్రతినిత్యం కష్టపడి పనులు నిర్వహిస్తుంటారు. వీరికి 1996 భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం ప్రకారం సంక్షేమ బోర్డు 2006లో నెలకొల్పి 12 రకాల సౌకర్యాలు కల్పించారు. వైసీపీ ప్రభుత్వం ఈ బోర్డును అపేసింది. ఈ సమస్యపై రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు అనేక పోరాటాలు నిర్వహించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భవన నిర్మాణ కార్మికుల పోరాటానికి నారా చంద్రబాబునాయుడు బాగా మద్దతిచ్చారు. గట్టిగా పోరాడండి అని నొక్కివక్కాణించారు. పవన్ కల్యాణ్ విశాఖపట్నంలో భవన నిర్మాణ కార్మికులను కూడగట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సంక్షేమ బోర్డు పునరుద్దరణకు 1 కోటి రూపాయలు విరాళం ప్రకటించారు అధికారం లోకి రాగానే ఈ కార్మికుల విషయమే మరచిపోయారు. ఇసుక విధానం కూడ మార్పుచేసినా ఇంకా గాడిలో పడలేదు. ఉచిత విధానం అంటున్నా ఇప్పటికి ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులకు పనులు లేవు. దీనిపైనా ప్రభుత్వానికి చలనం లేదు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్దరించే ఆలోచనే లేదు. మరో ముఖ్యమైన రంగం మున్సిపల్ కార్మికులు వీరు కూడ గత ప్రభుత్వ హయంలో 14 రోజుల పాటు 77 మున్సిపాలిటీలల్లో, 17 కార్పొరేషన్లలో సమ్మె నిర్వహించి కొన్ని కోర్కెలు సాధించారు. ఇంకా కొన్ని అపరిష్కృతంగా మిగిలిపోయాయి వాటిని ఈ ప్రభుత్వం పక్కన పెట్టింది. అలాగే మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే వంటవాళ్ల సమస్యలు అధికంగా ఉన్నాయి, వారికి నెలకు కేవలం రు.3వేలు మాత్రమే ఇస్తున్నారు వారి గురించి అలోచనే చేయరు. అన్ని రాష్ట్ర కార్యాలయాల్లో హౌస్‌కీపింగ్ వారిని, అటెండర్లను అప్కాస్‌లో కలపాలని కోరినా ఫలితంలేదు పట్టించు కోవడంలేదు

మరో పక్క స్వచ్ఛభారత్ మిషన్ కింద అన్ని నగర, మేజర్ పంచాయితీలలో గ్రీన్ అంబాసిడర్లు 17 నెలలుగా జీతాలు ఇవ్వక చాల ఇబ్బందులు పడుతున్నారు, క్లాప్ డ్రైవర్లది కూడా ఇదే పరిస్థితి. ఈ మంత్రిత్వశాఖ పవన్ కల్యాణ్ పరిధిలోనే ఉంది. అయినా ఫలితంలేదు. మరో పక్క స్కూలు స్వీపర్లకు 7 నెలలుగా వేతనాలు లేవు వీరితో పాటు అనేక రంగాలల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల కష్టాలు వర్ణణాతీతం. గత పాలనలో సచివాలయ వ్యవస్థ క్రింద నియమితులైన 2 లక్షల 56 వేల మంది వలంటీర్ల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. ఉంచుతారో, ఊడపీకుతారో తెలియని పరిస్థితి. వీరికి కూడా జీతభత్యాలు ఇవ్వకుండా గాలిలో పెట్టారు. కార్మికవర్గం పట్ల నిర్లక్ష్యం వహించిన పాలకులకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో పంగనామాలు పెట్టి 11 సీట్లు మాత్రమే ఇచ్చిన పరిస్థితి నేటి పాలకులు మరిచినట్లు ఉన్నారు. వీరికి కూడా ఈగతి పట్టక ముందే అసంఘటితరంగ కార్మిక సమస్యలపై దృష్టి పెట్టాలి. రాష్ట్రంలో లక్షాలాది మంది ఉన్న ఆటో, హమాలి(ముఠా) కార్మికుల, వీధి విక్రయదారుల సమస్యలు పరిష్కరించాలి. వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చెయ్యాలి. ఈ సమస్యలను ఎన్నికల సమయంలోనూ ప్రస్తావించారు. నేడు అ ఊసే ఎత్తడం లేదు. ప్రభుత్వ గోదాములలో లోడింగు అన్‌లోడింగు చేసే కార్మికులకు వేతనాలు పెంపుదల చేయవలసిఉన్నా పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ సమస్యలేవీ రాష్ట్ర ప్రభుత్వానికి చెవికెక్కడం లేదు. ప్రతిపక్ష పార్టీ కూడా ఇన్ని సమస్యలు ఉంటే వీటిని వదిలేసి చంద్రబాబునాయుడు మాయ వ్యాఖ్యానాలకు ప్రతివ్యాఖ్యానాలు చేయడంలో నిమగ్నమై ఉన్నారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో కార్మికుల సమస్యలు కోకోల్లలుగా ఉన్నాయి. పంచాయతీరాజ్, ఆటవి శాఖల్లో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు ఏ ఒక్కటి పరిష్కారం కావడం లేదు ఇతర మంత్రిత్వశాఖల పరిధిలోని వివిధ విభాగాల్లోనూ అనేక సమస్యలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వందరోజుల పాలన ఎలా బాగుంది. ఈ ప్రభుత్వం ఎలా మంచి ప్రభుత్వం అవుతుందో ప్రభుత్వ పెద్దలే సమాధానం చెప్పాలి. కార్మిక సంఘాలు ఈ 100 రోజులు ఎంతో సంయమనం పాటించారు. ప్రభుత్వం రాగానే పోరాటం ఎందుకులే కొద్దిగా సమయం ఇద్దామని వేచి చూస్తున్నారు. అయినా ప్రభుత్వ తీరులో మార్పులేదు.

సెల్: 9949207506
ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి

మరో ఆరు నెలలు ఏఎఫ్ఎస్పీఏ పొడిగింపు

న్యూఢిల్లీ: నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్‌లోని కొని జిల్లాల్లో సాయుధ దళాల (ప్రత్యేక అధికారాలు) చట్టం (ఏఎఫ్ఎస్పీఏ)ను కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ రెండు ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి భద్రతల పరిస్థితిని సమీక్షించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నది. సాయుధ దళాల చట్టం 1958 (28 ఆఫ్ 1958) సెక్షన్ 3 ద్వారా సంక్రమించిన అధికారాలను కేంద్ర ప్రభుత్వం వినియోగించింది. నాగాలాండ్‌లోని ఎనిమిది జిల్లాలు, మరో ఐదు జిల్లాల పరిధిలోని 21 పోలీస్ స్టేషన్లు, అరుణాచల్ ప్రదేశ్‌లోని మూడు జిల్లాలను 'అంతరాయం ప్రాంతాలు'గా పేర్కొంది. 2024 ఏప్రిల్ ఒకటి నుంచి ఆరు నెలల వరకు అమలులో ఉన్న సాయుధ దళాల (ప్రత్యేక అధికారాలు) చట్టాన్ని మరో ఆరు నెలలపాటు పొడిగించినట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. నాగాలాండ్‌లో శాంతి భద్రతల పరిస్థితిపై సమీక్ష నిర్వహిస్తామని వెల్లడించింది. కాగా, శాంతి భద్రతలు లోపించిన ప్రాంతాలను 'అంతరాయం కలిగించే' ప్రాంతాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది. ఆయా ప్రాంతాలలో పనిచేసే భద్రతా దళాలకు సాయుధ దళాల చట్టం కింద ప్రత్యేక అధికారాలు కల్పిస్తుంది. ప్రజా శాంతి నిర్వహణ కోసం సోదాలు చేసేందుకు, అరెస్టు చేసేందుకు, అవసరమైతే కాల్పులు జరిపేందుకు ఏఎఫ్ఎస్పీఏ ద్వారా విస్తృత అధికారాలు ఇస్తుంది.

పూజా ఖేడ్కర్ ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ: ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేడ్కర్ పరీక్షల సమయంలో రిజర్వేషన్లను పొందడానికి నకిలీ కుల ధృవీకరణ పత్రాలు సమర్పించినట్లు ఆరోపణలొచ్చాయి. ఈ ఆరోపణల మేరకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆమె ఐఏఎస్ ఎంపికను రద్దు చేసింది. అన్ని పరీక్షల నుంచి ఆమెను డిబార్ చేసింది. ఈ నేపథ్యంలో ఆమెపై నమోదైన క్రిమినల్ కేసులో అరెస్టు నుంచి మధ్యంతర రక్షణను గురువారం దిల్లీ హైకోర్టు పొడిగించింది. ఈ కేసులో పూజా అరెస్టుకు ముందే ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను అక్టోబరు నాలుగో తేదీన విచారణ జాబితాలో లిస్ట్ చేయమని పూజా తరఫు న్యాయవాది కోర్టును కోరారు. అయితే బెయిల్ పిటిషన్ విచారణను న్యాయమూర్తి చంద్ర ధరి సింగ్ వాయిదా వేశారు. కాగా, పూజా ఖేడ్కర్ తరఫున న్యాయవాది యూపీఎస్సీ చేసిన ఆరోపణలకు సంబంధించి ఫైల్ దాఖలు చేయడానికి మరింత సమయం కావాలని కోర్టును కోరారు.

ఎన్‌కౌంటర్‌కు ఫడ్నవిస్ సమర్థన

ముంబై: మహారాష్ట్రలోని థానె జిల్లా బద్లాపూర్‌లో ఓ పాఠశాలలో ఇద్దరు చిన్నారులపై లైంగిక దాడి... నిందితుడిని పోలీసులు కాల్చిచంపడంపై మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ గురువారం స్పందించారు. 'ఇండియాటుడే కాంక్లేవ్'లో ఫడ్నవిస్ మాట్లాడుతూ తమపై కాల్పులు జరుగుతుంటే పోలీసులు చప్పట్లు కొడతారా అని ప్రశ్నించారు. 'మేం ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకం. చట్టాలను కచ్చితంగా అనుసరించాలి. వాటి ప్రకారం నేరస్థులకు శిక్షపడాలి. ఆ ప్రక్రియ అంతా వేగంగా జరగాలి. తమపై కాల్పులు జరుగుతుంటే... పోలీసులు చప్పట్లు కొట్టరు. ఆత్మరక్షణలో భాగంగా వారు నిందితుడిని కాల్చారు' అని ఫడ్నవిస్ అన్నారు. ఇదేవేదికపై ఎన్‌కౌంటర్ గురించి ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కూడా మాట్లాడారు. 'పోలీసులు ఆత్మరక్షణ కోసమే ప్రతిస్పందించారు. ఈ ఘటనపై ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయి. అతడిని కావాలనే పారిపోయేలా చేసినట్లు ఆరోపిస్తున్నాయి. ఒకవేళ అతడు తప్పించుకుని ఉంటే ఏం జరిగేది. దురదృష్టవశాత్తు ఎన్‌కౌంటర్‌లో పోలీసులకు గాయాలయ్యాయి. మనమంతా వారికి మద్దతివ్వాలి' అని షిండే అన్నారు.

హేమంత్ సర్కార్ ఓటమి ఖాయం: రాజ్‌నాథ్

రాంచీ: కొద్ది నెలల్లో జరగబోయే జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో జేఎంఎం సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఓటమి ఖాయమని, భూమిపై ఉన్న ఏ శక్తీ దాన్ని ఆపలేదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పుకొచ్చారు. 2027 నాటికి అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని ప్రపంచ ఆర్థికరంగ నిపుణులు అంచనా వేస్తున్నారని తెలిపారు. ధన్‌బాద్‌లో గురువారం నిర్వహించిన సభలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ అవినీతి ఆరోపణలపై జైలుకెళ్లిన సీఎం హేమంత్ సోరెన్ గొప్ప వీరుడిలా నటిస్తున్నారని విమర్శించారు. అవినీతిపరుడైన సీఎం రాష్ట్రాన్ని అభివృద్ధివైపు నడిపించలేరని అన్నారు. జార్ఖండ్‌లో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేసేందుకు బీజేపీకి వరుసగా రెండు అవకాశాలు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగ వ్యవస్థ నాశనం

- యువత జీవితం దుర్భరం
- కాంగ్రెస్ వస్తే రాష్ట్రం సుభిక్షం
- హర్యానా ర్యాలీలో రాహుల్

అస్సాంథ్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో హర్యానా రాష్ట్రం సుభిక్షం కాగలదని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. బీజేపీ పాలనలో హర్యానా ఉద్యోగ వ్యవస్థ నాశనమైందని, రాష్ట్ర అభివృద్ధిని స్తంభించిందని విమర్శించారు. హర్యానాలోని అస్సాంథ్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ గురువారం ప్రసంగించారు. బీజేపీపై, ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ఎన్నికలను కాంగ్రెస్ స్వీప్ చేస్తుందని విశ్వాసంగా చెప్పారు. ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి... ప్రతి ఒక్కరికి గౌరవం, ఉపాధి లభించే రాష్ట్రంగా హర్యానాను తీర్చిదిద్దుతామని హామీనిచ్చారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తామని సంకల్పించారు. రాష్ట్రంలోని ప్రతి వర్గాన్ని బీజేపీ ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. యువత, రైతులు, వ్యాపారుల సౌభాగ్యాన్ని హరించిందని ఆరోపించారు. హర్యానాను తిరిగి సుసంపన్నం చేయడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని రాహుల్ గాంధీ అన్నారు. ఉపాధి లభించక విదేశాలకు వెళ్లిన తమ పిల్లలకు దూరమై తల్లిదండ్రులు వేదన అనుభవిస్తున్నారని, అక్కడ పిల్లలు కూడా తిరిగి రాలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. దేశంలోని పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్డులన్నీ అదానీ వశమయ్యాయని దుయ్యబట్టారు. జీఎస్టీ, నోట్ల రద్దు వంటి తప్పుడు నిర్ణయాలతో సామాన్యులు అష్టకష్టాలు పడాల్సి వస్తోందన్నారు. చిన్న వర్తకులను తుడిచిపెట్టి చైనా వస్తువులను భారత్‌లో విక్రయించాలని మోదీ ప్రభుత్వం యత్నిస్తోందని, తద్వారా దేశంలోని కొందరు పారిశ్రామికవేత్తలతో పాటు చైనా వ్యాపారులకు లబ్ధి చేకూరుతోందని రాహుల్ అన్నారు. ఓ వైపు మోదీ మార్కెటింగ్ జరుగుతుంటే మరోవైపు హర్యానా యువత కన్నీళ్లు పెట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. 'పతకాలు సాధించేందుకు హర్యానా క్రీడాకారులు రేయింబవళ్లు కష్టపడుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి, దేశానికి గుర్తింపు తేవాలని ఆకాంక్షిస్తున్నారు కానీ మహిళా క్రీడాకారులకు కష్టం వస్తే నిందితులను కాపాడటంతో బీజేపీ నిమగ్నమైంది' అని మల్లయోధుల వ్యవహారాన్ని ఉద్దేశించి రాహుల్ వ్యాఖ్యానించారు. మాదకద్రవ్యాల కేసులు పెరుగడంపై ఆందోళన వ్యక్తంచేశారు. గుజరాత్‌లోని అదానీ పోర్టులో కొన్ని వేల కిలోల మాదకద్రవ్యాలను గర్తించారు కానీ ఏ మీడియాలో వార్తలు రాలేదు... ఎవరికీ శిక్షలు పడలేదని రాహుల్ వ్యాఖ్యానించారు. ఎన్నడూ రుణమాఫీకి నోచుకొని హర్యానా రైతులు తీవ్రంగా ప్రభావితమయ్యారని, వారికి సముచిత ఎంఎస్పీ కూడా లేదని అన్నారు. దేశంలోని కొందరు సంపన్నులకు రూ.16లక్షలకోట్ల రుణమాఫీ జరిగిందని గుర్తుచేశారు. మోదీకి బీజేపీ ప్రభుత్వానికి కార్పొరేట్ల ప్రయోజనాలు తప్ప రైతుల కష్టాలు, కన్నీళ్లు పట్టవని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ర్యాలీలో మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా, ఎంపీ కుమారీ సెల్జా, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

మళ్లీ అధికారం మాదే

హర్యానా సభలో మోదీ

న్యూఢిల్లీ: విపక్షంలో ఉండి ఏమీ చేయలేని కాంగ్రెస్ పార్టీ... అధికారం వచ్చినా చేసేదేమీ ఉండదని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని దుయ్యబట్టారు. హిమాచల్ ప్రదేశ్ పరిస్థితిని ప్రస్తావిస్తూ అక్కడ అభివృద్ధి స్తంభించిందని, జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని అన్నారు. అంతర్గత కుమ్ములాటలను పరిష్కరించుకోవడమే కాంగ్రెస్‌కు సరిపోతోందని, ఆ పార్టీ రోజురోజుకూ డీలా పడిపోతోందని వ్యాఖ్యానించారు. బీజేపీకి మరో అవకాశం ఇవ్వాలని హర్యానా నిర్ణయించుకుందని, కాంగ్రెస్ గెలుపు కల సాకారం కాబోదన్నారు. ఆ పార్టీని నమ్మే పరిస్థితిలో హర్యానా ప్రజలు లేరన్నారు.మోదీ గురువారం హర్యానాలోని బీజేపీ కార్యకర్తలతో నమో యాప్ ద్వారా సంభాషించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్లుగా ప్రతిపక్ష బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడంలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ గురించి నిజాలను బట్టబయలు చేయాలని పార్టీ శ్రేణులకు మోదీ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో హర్యానాలో దళితులపై ఆకృత్యాలు అన్నీ ఇన్నీ కాదన్నారు. పంట నష్టం జరిగితే హర్యానా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 చెక్కులు ఇచ్చిందన్నారు. అవినీతి రహిత బీజేపీ దశాబ్ద పాలనలో హర్యానా ప్రజలు సంతోషంగా ఉన్నారని మోదీ చెప్పుకున్నారు. ఎన్నికల వ్యూహాలపై బూత్‌స్థాయి కార్యకర్తలతో చర్చించారు. తమపై పోటీ చేసేవారు చెప్పేవన్నీ అబద్ధాలేనని, తలా తోక లేకుండా మాట్లాడుతూ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారని మోదీ విమర్శించారు. 1990 దశకంలో హర్యానాలోని పార్టీ తరఫున పనిచేసే అవకాశం లభించడాన్ని అదృష్టంగా భావిస్తానన్నారు. పాత తరం, కొత్త తరం కార్యకర్తలు, నేతల్లోని కష్టపడే మనస్తత్వం తనకు స్ఫూర్తినిచ్చినట్లు మోదీ తెలిపారు. కిందిస్థాయి కార్యకర్తలతో మాట్లాడే అవకాశం ఎప్పుడు లభించినా ఆనందంగా ఉంటుందని చెప్పారు. 'మేరా బూత్ సబ్‌సే మజ్బూత్' (నా బూత్ మిగతా వాటి కంటే పటిష్ఠం) నినాదంతో రేయింబవళ్లు కష్టపడుతున్నారు. ఇదే మన ఎన్నికల వ్యూహం... బహిరంగ సత్యం' అని మోదీ వ్యాఖ్యానించారు. తన పార్టీ జెండాను బీజేపీ కార్యకర్తలు కింద పడనివ్వరన్నారు. గతంలో కంటే ఎక్కువ మంది బూత్‌లకు వచ్చి బీజేపీకి ఓటు వేసేలా చేయడం ప్రతి కార్యకర్త బాధ్యతని మోదీ పిలుపునిచ్చారు. మూడోసారి అధికారంలోకి రావడంపై ప్రధాని దీమా వ్యక్తంచేశారు.

ఆగిన పనులు మళ్లీ ప్రారంభం

దిల్లీ ప్రజలకు కేజ్రీవాల్ హామీ

న్యూఢిల్లీ: బీజేపీపై ఆమ్‌ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. బీజేపీ నేత ఒకరు చెప్పిన మాటలు తనను దిగ్భ్రాంతికి గురిచేశాయని అన్నారు. 'నా అరెస్టు వల్ల ఏమి లాభం జరిగిందని ఇటీవల బీజేపీ సీనియర్ నేతను నేను అడిగాను. ఆయన చెప్పిన మాటలు విని నేను షాక్ అయ్యా. దిల్లీలో పాలన పట్టాలు తప్పిందని, పనులు ఆగిపోయాయని ఆ నేత బదులిచ్చారు. దిల్లీలో పనులు ఆగిపోయేలా చేసి, పాలన పట్టాలు తప్పేలా చేసి, ప్రజలకు అసౌకర్యం కలిగించడమే వారి ఉద్దేశమా? దిల్లీ ప్రజలారా మీరు ఆందోళన చెందొద్దు. నిలిచిపోయిన పనులన్నీ మళ్లీ మొదలవుతాయి. అన్ని సమస్యలు తొలగుతాయి. జైల్లో కూడా నేను ప్రజల పనుల గురించే ఆలోచించాను' అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. కాగా, దిల్లీ అసెంబ్లీ సీటింగ్ మారింది. నూతన ముఖ్యమంత్రి ఆతిశీకి మొదటి సీటు కేటాయించారు. గతంలో ఆ నంబర్ 19గా ఉండేది. ఇంతకాలం తొలిసీటులో కూర్చున్న కేజ్రీవాల్‌కు 41వ సీటు కేటాయించారు. మిగతా మంత్రులు, ఎమ్మెల్యే సీట్ల స్థానాలు కూడా మారాయి. ఇదిలా ఉంటే... ఆతిశీ సీఎం పద చేపట్టినా కేజ్రీవాల్ కోసం పక్కన కుర్చీ ఖాళీగా ఉంచి... తాను వేరే సీట్లో కూర్చొని బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 'నాకు ప్రస్తుతం భరతుడికి ఎదురైన పరిస్థితే ఉంది. రాముడు వనవాసానికి వెళ్లినప్పుడు... భరతుడు పాలించాల్సి వచ్చింది. సింహాసనంపై రాముడి పాదుకలు ఉంచి రాజ్యాన్ని ఏలాడు. ఈ కుర్చీ అరవింద్ కేజ్రీవాల్‌ది. నాలుగు నెలల తర్వాత జరిగే ఎన్నికల్లో దిల్లీలో మళ్లీ ఆయన అధికారం చేపడతారని విశ్వసిస్తున్నా. ఆయన తిరిగివచ్చేవరకు ఈ కుర్చీ ఇక్కడే ఉంటుంది' అని ఆతిశీ అన్నారు.

పుణ్యస్నానాల్లో అపశ్రుతి 46 మంది మృతి

పాట్నా: బీహార్‌లో జియుతియా స్నానాల ఆచారం 46 మందిని బలిగొంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో జియుతియా స్నానాలకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి 46 మంది మృతి చెందారు. మృతుల్లో 37మంది పిల్లలు ఉన్నారు. గురువారం మొత్తం 15 జిల్లాల్లో జియుతియా పుణ్య స్నానానికి వెళ్లి మునిగిపోయిన సంఘటనలు నమోదయ్యాయి. వీటిలో ఔరంగాబాద్ లో అత్యధికంగా 10మంది, చప్రాలో 5 మంది, రోహతాస్ లో నలుగురు, కైమూర్, సివాన్, మోతిహారిలో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. బెట్టియా, బెగుసరాయ్ లో మునిగి ఇద్దరు వ్యక్తులు మరణించారు. గోపాల్ గంజ్, భోజ్ పూర్, నలంద, దర్భంగా, మధుబని, సమస్తిపూర్, అర్వాల్లో ఒక్కొక్కరు దుర్మరణం పాలైనట్లు తెలిసింది ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ జియుతియా స్నానాల మరణాల పట్ల విచారం వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ప్రతి సంవత్సరం అశ్విన్ మాసంలో జియుతియా పండుగ సందర్భంగా మహిళలు తమ పిల్లల దీర్ఘాయువు కోసం ఉపవాసం ఉండి పూజలు, పుణ్యస్నానాలు చేస్తారు. దీనిని జియుతియ వ్రతం అని కూడా అంటారు. ఔరంగాబాద్ జిల్లా బరూన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ప్రమాదంలో 8 మంది చిన్నారులు మృతి చెందారు. వీరిలో నలుగురు బాలికలు ఉన్నారు. ఇక్కడ మహిళలు, బాలికలు చెరువులో స్నానాలు చేస్తుండగా ఈ ప్రమాదాలు జరిగాయి. మదన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుషాహాలో 18 మంది చిన్నారులు స్నానం చేస్తుండగా నీటిలో మునిగిపోతున్న సమయంలో చిన్నారుల అరుపులు విని స్థానికులు 14 మంది చిన్నారులను కాపాడారు. అయితే నీటిలో మునిగి నలుగురు చిన్నారులు చనిపోయారు. ఇప్పటివరకు మొత్తం 43 మృతదేహాలను లభ్యమైనట్లు విపత్తు నిర్వహణ విభాగం (డీఎంఎం) ఒక ప్రకటనలో తెలిపింది. ఇంకా గాలింపు కొనసాగుతోందని వెల్లడించింది.

'సీఎం పదవి నుంచి తప్పుకోండి'

సిద్ధరామయ్యకు సొంత పార్టీ నేతల సలహా

బెంగళూరు: కర్నాటక సీఎం సిద్ధరామయ్య ఇరకాటంలో పడ్డారు. ముడా స్కామ్ ఆరోపణల నేపథ్యంలో సీఎం పదవికి ఆయన రాజీనామా చేయాలని ఓ వైపు ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుండగా, మరోవైపు సీఎం పదవి నుంచి తప్పుకోవాలని సొంత పార్టీ నేతలు కూడా సిద్ధరామయ్యకు సూచిస్తున్నారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కుంభకోణానికి సంబంధించి సిద్ధరామయ్యపై కేసు నమోదు చేయాలని ట్రయల్ కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో సీఎం పదవి నుంచి ఆయన తప్పుకోవాలని కాంగ్రెస్ నేతలు గళమెత్తుతున్నారు. కాగా, రాష్ట్రంలోని అధికార పార్టీకి మరింత ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి పదవి నుంచి సిద్ధరామయ్య తప్పుకోవాలని ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మాజీ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసిన కేబీ కోలీవాడ్ (79) సూచించారు. 'ఈ మచ్చ తొలగిపోయిన తర్వాత ఆయన మళ్లీ సీఎం కావచ్చు. ఇది నా వ్యక్తిగత అభ్యర్థన' అని మీడియాతో అన్నారు. ఈ పరిస్థితిని ప్రతిపక్ష పార్టీలు ఉపయోగించుకుంటున్నాయని కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీకి అధ్యక్షుడైన కేబీ కోలీవాడ్ విమర్శించారు. ప్రధాని మోదీ కూడా హర్యానాలో దీని గురించి మాట్లాడటాన్ని ఆయన గుర్తు చేశారు.

విలేకరులపై అసహనం

కర్నాటక రాజకీయాల్లో ముడా (మైసూరు నగరాభివృద్ధి సంస్థ) స్కామ్ కలకలం సృష్టిస్తోంది. దీంతో సీఎం సిద్ధరామయ్య చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఈ కుంభకోణం సమగ్ర దర్యాప్తులో భాగంగా సీఎంను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వడం చట్టబద్ధమేనని ఇటీవలే హైకోర్టు తీర్పునిచ్చింది. అనంతరం లోకాయుక్త అధికారి అధ్వర్యంలో దర్యాప్తునకు ప్రత్యేక న్యాయస్థానం అనుమతించింది. ఈ పరిణామాల నేపథ్యంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాలని బీజేపీ, జేడీఎస్ డిమాండ్ చేస్తూ నిరసనలు తెలుపుతున్నాయి. దీనిపై స్పందించాలని సీఎంను మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. దీంతో సహనం కోల్పోయిన ఆయన, మైక్‌ను పక్కకు తోసేశారు. 'అవసరమైతే నేనే పిలిచి మాట్లాడుతాగా' అంటూ కాస్త కోపంగా మాట్లాడారు. 'ముడా' స్థలాల కేటాయింపుల్లో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కుటుంబసభ్యులు లబ్ధి పొందటం, అందుకు ముఖ్యమంత్రి అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు దాఖలాలతో సామాజిక కార్యకర్త టి.జె.అబ్రహం గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయనతో పాటు స్నేహమయి కృష్ణ, ప్రదీప్‌కుమార్ ముఖ్యమంత్రిపై ఫిర్యాదు చేశారు. ఆయా ఫిర్యాదుల మేరకు గత నెల 16న సీఎంను విచారించాలంటూ గవర్నర్ ఆదేశించారు. ఈ ఆదేశాలను రద్దు చేయాలని మంత్రివర్గం తీర్మానించగా... దానిని గవర్నర్ తోసిపుచ్చారు. సీఎం హైకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ఇదిలాఉండగా... ఆరోపణలు ఎదుర్కొంటున్న సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేసి, విచారణను ఎదుర్కొనడం తప్పనిసరని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర జోస్యం చెప్పారు. ఆయన ఎంత మొండిగా వ్యవహరించినా, పీఠాన్ని వీడవలసిందేనని వ్యాఖ్యానించగా, మరోవైపు తాను విచారణకు భయపడటం లేదని సీఎం అన్నారు.

వారంలోగా డిమాండ్లు పరిష్కరించాలి

బెంగాల్ సీఎస్‌కు జూనియర్ వైద్యుల లేఖ

కోల్‌కతా: అపరిష్కృత డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జూనియర్ వైద్యులు పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తాజాగా లేఖ రాశారు. కోల్‌కతాలోని ఆర్జీకర్ వైద్యకళాశాల ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన అనంతరం ఆందోళనకు దిగిన జూనియర్ వైద్యులు 42రోజుల పాటు విధులు బహిష్కరించిన సంగతి విదితమే. ప్రభుత్వంతో చర్చల అనంతరం ఐదురోజులుగా వారు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పాక్షికంగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా సెప్టెంబరు 18న జరిగిన సమావేశంలో చర్చించిన తమ అపరిష్కృత డిమాండ్లను గుర్తుచేస్తూ పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫోరమ్ (డబ్ల్యుబిజెడిఎఫ్) ప్రతినిధులు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్‌కు ఇ-మెయిల్ పంపారు. "మేము లేవనెత్తిన, రెండు పక్షాలు అంగీకరించిన కొన్ని ముఖ్యమైన డిమాండ్‌లకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకోలేదని లేదా ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదని మేము మీ దృష్టికి తేవాలనుకుంటున్నాం' సెప్టెంబర్ 18న పంత్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ సమావేశంలో తమ కీలక డిమాండ్లను ప్రభుత్వం మౌఖికంగా అంగీకరించినట్లు జూనియర్ డాక్టర్లు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వైద్య కళాశాలల్లో బెదిరింపు సంస్కృతిని పరిష్కరించడానికి కేంద్ర విచారణ కమిటీని ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను వారు పునరుద్ఘాటించారు. ఈ వాతావరణాన్ని పెంపొందించడంలో నిమగ్నమైన వారిపై దర్యాప్తు చేయడానికి అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్‌లతో కూడిన 'కళాశాల స్థాయి విచారణ కమిటీలను' కళాశాలలు ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని కూడా లేఖ హైలైట్ చేసింది. అంతేకాకుండా, బెదిరింపు సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారని మరియు ఆరోగ్య సిండికేట్‌లను నడుపుతున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పశ్చిమ బెంగాల్ మెడికల్ కౌన్సిల్ (డబిఎంసి), పశ్చిమ బెంగాల్ హెల్త్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (డబ్ల్యూబిహెచ్‌ఆర్‌బి) సభ్యులపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేయాలనే తమ డిమాండ్‌ను డబ్ల్యుబిజెడిఎఫ్ పంత్‌కు గుర్తు చేసింది. తదుపరి ఏడురోజుల్లోగా వీటిని పరిష్కరించాలని గడువు విధించింది.

తమిళనాడు మాజీమంత్రికి సుప్రీం బెయిల్

న్యూఢిల్లీ: తమిళనాడు మాజీ మంత్రి వి.సెంథిల్ బాలాజీకి మనీలాండరింగ్ కేసులో సుప్రీంకోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. ముగ్గురు సభ్యులతో కూడిన ధర్మాసనం షరతులతో కూడిన బెయిల్‌ను ఆయనకు మంజూరు చేసింది. ఈ కేసులో ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. కోర్టు ఈ కేసులో ఆగస్టు 12న తీర్పును రిజర్వ్ చేసింది. సెంథిల్ బాలాజీ తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా వాదించారు. తమిళనాడు రవాణాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో సెంథిల్ బాలాజీపై ఉద్యోగాల కోసం నగదు తీసుకున్నారని ఈడీ ఆరోపించింది. క్యాష్ ఫర్ జాబ్స్ కుంభకోణంతో ముడిపడిన మనీలాండరింగ్ కేసులో బాలాజీని ఈడీ గత ఏడాది జూన్ 14వ తేదీన అరెస్టు చేసింది. ఆగస్టు 12వ తేదీన ఆయనపై 3 వేల పేజీల ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో గతేడాది అక్టోబర్ 19వ తేదీన బాలాజీ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ కేసులో స్థానిక కోర్టు కూడా బాలాజీ బెయిల్ పిటిషన్లను మూడుసార్లు కొట్టివేసింది.

బస్ మార్షల్స్ పునఃనియామకం

న్యూఢిల్లీ: పదివేల మంది బస్ మార్షల్స్‌ను తిరిగి నియమించేందుకు దిల్లీ అసెంబ్లీ తీర్మానించింది. ముఖ్యమంత్రిగా అరవింద్ కేజ్రీవాల్ జైలు పాలు కావడంతో బస్ మార్షల్స్ సేవలు రద్దు అయ్యాయి. ఇప్పుడు వారి సేవలను పునరుద్ధరించేందుకు అసెంబ్లీ అంగీకరించింది. అధికార ఆప్, విపక్షాల మధ్య వాడీవేడి చర్చల అనంతరం మూజువాణి ఓటు ద్వారా దీనికి సభ ఆమోదం లభించింది. ఆప్, బీజేపీ ఎమ్మెల్యేలు అక్టోబరు 3వ తేదీ ఉదయం 11గంటలకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాతో భేటీ కావాలని, ఆయన ఆమోదించేంత వరకు అక్కడ నుంచి కదలవద్దని ఆప్ నేత, ఆరోగ్య మంత్రి సౌరభ్ భరద్వాజ్ పిలుపునిచ్చారు.

రిజర్వేషన్ల రద్దు బీజేపీ లక్ష్యం: చిదంబరం

న్యూఢిల్లీ: రిజర్వేషన్లను పూర్తిగా రద్దు చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెనకాడదని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిందంబరం విమర్శించారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం ప్రమాదంలో ఉందని... బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని ఎన్నికల ముందు ఆయన ఆరోపించారు. దీనిపై మీడియా అడిగిన ప్రశ్నకు చిదంబరం స్పందించారు. 'రాజ్యాంగాన్ని బీజేపీ కచ్చితంగా సవరిస్తుంది. అందుకు వారు ప్రయత్నిస్తున్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు విఘాతం కలిగిస్తుంది' అని ఆరోపించారు. డిజిటల్ లావాదేవీలు భారత్ సాధించిన పురోగతిని ఉద్దేశిస్తూ మోదీ ప్రభుత్వాన్ని చిదంబరం అభినందించారు. 'నగదు అవసరం లేకుండా డిజిటల్ విధానంలో పేమెంట్లు జరుగుతున్నాయి. ఇది అభినందించదగిన విషయం. అయితే... జర్మనీ, యూరప్‌లలో పూర్తిగా నగదురహిత సమాజం ఏర్పడలేదు. ఇక్కడ కూడా అంతే. పెద్దనోట్ల రద్దు ప్రకటన నాటికి చెలామణిలో ఉన్న నగదు రూ.16 నుంచి 17 లక్షల కోట్లు. నేడు అది రూ. 34 లక్షల కోట్లకు చేరింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో డిజిటల్ పేమెంట్‌కు బదులు ప్రజలు నగదు కోరుకుంటున్నారు. దాన్ని వారినుంచి దూరం చేయలేం' అని పేర్కొన్నారు.

నిందితులను ఎన్నాళ్లు జైల్లో ఉంచుతారు?

ఈడీకి సుప్రీం కోర్టు మందలింపు

న్యూఢిల్లీ: బొగ్గు కుంభకోణానికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో సస్పెండ్ అయిన చత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రభుత్వ అధికారి సౌమ్య చౌరాసియాకు... ఆమె కస్టడీలో గడిపిన సమయం, ఆరోపణలు నమోదు చేయకపోవడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని సుప్రీంకోర్టు గురువారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. విచారణలో ఉన్నవారిని ఎన్నాళ్లు జైలులో ఉంచుతారని ఈడీని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. నాటి చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ వద్ద డిప్యూటీ సెక్రటరీగా చౌరాసియా పనిచేశారు. బొగ్గు కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమె నిందితురాలు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సూర్యకాంత్, దీపాంకర్ దత్తా, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం సౌమ్య చౌరాసియాకు బెయిల్ మంజూరు చేసింది. ఆమె ఇప్పటికే ఒక సంవత్సరం తొమ్మిది నెలల పాటు కస్టడీలో ఉన్నారని, ఆమె సహ నిందితుల్లో కొందరు ఇప్పటికే మధ్యంతర బెయిల్‌పై విడుదలయ్యారని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ట్రయల్ కోర్టుకు హాజరుకాక పోవడం, నిందితులలో కొందరిపై నాన్-బెయిలబుల్ వారెంట్లను అమలు చేయకపోవడం వల్ల అభియోగాలు నమోదు చేయడం సాధ్యం కాదని చత్తీస్‌గఢ్ హైకోర్టు గతంలో పేర్కొంది. ఈ దరిమిలా, తదుపరి తేదీలో విచారణకు అవకాశం కల్పించాలనే ఉద్దేశ్యంతో, తాము పిటిషనర్‌ను మధ్యంతర బెయిల్‌పై విడుదల చేయాలని నిర్దేశిస్తున్నామని సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే ఆమె మధ్యంతర బెయిల్‌పై ఉన్నందున తిరిగి సర్వీస్‌లో చేర్చుకోవద్దని, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సస్పెన్షన్‌లో ఉంచాలని కూడా అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. చౌరాసియా తదుపరి కోర్టు విచారణకు హాజరుకావాలని, అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. సాక్షులను ప్రభావితం చేయడానికి లేదా సాక్ష్యాలను తారుమారు చేయడానికి ప్రయత్నించవద్దని, ఆమె తన పాస్‌పోర్ట్‌ను ప్రభుత్వానికి అప్పగించాలని కోర్టు ఆదేశించింది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని కూడా అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారిస్తున్న కేసుల్లో నేరారోపణ రేటు ఎంతని... నిందితులను ఎన్నాళ్లు జైల్లో ఉంచుతారంటూ సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కాగా, ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదించగా, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే, న్యాయవాది పల్లవి శర్మ ఈ కేసులో చౌరాసియా తరఫున వాదించారు. సౌమ్య చౌరాసియా 2022 డిసెంబరులో బొగ్గు కుంభకోణంతో సంబంధమున్న మనీలాండరింగ్ కేసులో అరెస్టయ్యారు. తన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన చత్తీస్‌గఢ్ హైకోర్టు ఆదేశాలను చౌరాసియా సుప్రీం కోర్టులో సవాలు చేశారు.

పేదల జీవితాల్లో చీకటి నింపుతారా?

- నూతన మద్యం విధానానికి సవరణలు అవసరం
- అక్టోబరు 2న రాష్ట్రవ్యాప్త నిరసనలు
- రౌండ్‌టేబుల్ సమావేశంలో మహిళా నేతలు

విశాలాంధ్ర-విజయవాడ: అక్టోబరు ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్న నూతన మద్యం విధానాన్ని సవరించాలని, సమయం, షాపుల సంఖ్య కుదించాలని వక్తలు డిమాండ్ చేశారు. మద్యపానం వల్ల నేరాల సంఖ్య పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన మద్యం పాలసీని వ్యతిరేకిస్తూ మహిళా సంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో స్థానిక హనుమాన్‌పేట దాసరి భవన్‌లో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ మహిళాసమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని అధ్యక్షతన 'మద్యం ఆదాయమా? ప్రజాసంక్షేమమా?' అనే అంశంపై చర్చ జరిగింది. దుర్గాభవాని మాట్లాడుతూ మద్యపానం వల్ల కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని హెచ్చరించారు. అన్ని అనర్థాలకు కారణమైన మద్యాన్ని నిషేధించకపోగా మరింత ఎక్కువ ఆదాయం వచ్చే విధంగా మద్యం దుకాణాలు పెంచడం, 99 రూపాయలకే క్వార్టర్ సీసా అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించటం దారుణమని విమర్శించారు. రాష్ట్రంలో 2,600 మద్యం షాపులు పెంచడం, ప్రైవేటు వ్యక్తులకు లైసెన్సులు ఇవ్వడం, లైసెన్సు ఫీజుల ద్వారా ప్రభుత్వానికి రెండు వేల కోట్ల ఆదాయం రావడం వంటివి చూస్తుంటే రాష్ట్రానికి మద్యమే ప్రధాన ఆదాయవనరుగా భావిస్తూ పేదల జీవితాల్లో మరింత చీకటి నింపుతున్నారని మండిపడ్డారు. నాణ్యమైన మద్యం ప్రజల ప్రాణాలు తీయదా? మహిళలపై హింసకు కారణం కాదా అని ప్రశ్నించారు. నూతన మద్యం విధానంపై అన్ని వర్గాలతో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. గుడి, బడి, జాతీయ రహదారుల వద్ద మద్యం షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడపాలని సూచించారు. డీఅడిక్షన్ కేంద్రాలు పెంచాలన్నారు. ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే మద్యం షాపులకు అనుమతివ్వాలన్నారు. దశలవారీగా మద్య నిషేధం చేయాలని డిమాండ్ చేశారు. మహిళల అభిప్రాయాలు తీసుకుని... వాటికి అనుగుణంగా నూతన మద్యం పాలసీ అమలు చేయాలని కోరారు. కొత్త మద్యం పాలసీని వ్యతిరేకిస్తూ అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి రోజున మహిళా సంఘాల ఐక్యవేదక అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో పెద్దఎత్తున నిరసనలు చేపట్టనున్నట్లు ప్రకటించారు.

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ బెల్టు షాపులన్నీ నిషేధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటు వ్యక్తుల ద్వారా విక్రయించడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఎయిడ్స్, పొగత్రాగడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కలిగించినట్టే మద్యం వల్ల నష్టాలపైనా ప్రచారం చేయాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలన వందరోజులు పూర్తయితే...వంద రూపాయలకే మద్యం ఇవ్వాలని లేదన్నారు. మద్యం పాలసీపై డ్వాక్రా, వలంటీర్లతో సర్వే చేయించామని, ఇతర రాష్ట్రాల్లో మద్యం పాలసీపై అధ్యయనం చేశామని చెబుతున్న ప్రభుత్వం... ఆ నివేదికలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. మద్యం వల్ల ఎంత మంది చనిపోయారో, ఎన్ని కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయో కూడా సర్వే చేయించాలని కోరారు. నాసిరకం మద్య తాగి 30 వేల మంది చనిపోయారని, 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని ప్రచారం చేసిన కూటమి నేతలు... వంద రోజుల్లో ఆయా బాధిత కుటుంబాల్లో ఒక్కరికైనా న్యాయం చేశారా అని నిలదీశారు. మద్యం విధానంపై ఎందుకు శ్వేతపత్రం విడుదల చేయలేదని ప్రశ్నించారు. సారా ఉద్యమాన్ని రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదన్నారు. మహిళా ఉద్యమాలతో ప్రభుత్వాలు కూలిపోతాయని హెచ్చరించారు. ప్రగతిశీల మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పద్మ మాట్లాడుతూ రాజకీయ పార్టీల మధ్య విభేదాలు ఉన్నా... మద్యం పాలసీల్లో అన్ని పార్టీల విధానాలు ఒకటేనని విమర్శించారు. హైకోర్టు న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 2047 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఆవిర్భవిస్తుందని పాలకులు చెబుతున్నారని, కానీ ఈ విధానాల కారణంగా మద్యం విక్రయాల్లో, తాగటంలో ఏపీ ముందుంటుందన్నారు. రాష్ట్రంలో 11.9 శాతం మంది మద్యం తాగుతున్నారని చెప్పారు. ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడుస్తామని చెప్పే టీడీపీ నాయకులు మద్యం విచ్చలవిడిగా తాగే విధంగా నిర్ణయాలు తీసుకోవటం దారుణమన్నారు. గతంలో మాదిరిగా డ్రై డే పెట్టాలని, డీ అడిక్షన్ కేంద్రాల ద్వారా వైద్యం అందించాలని సూచించారు. భూమిక కలెక్టివ్ సంస్థ ప్రతినిధి దారా బిందు, అరసం నాయకులు ఎం.అరుణకుమార్ మాట్లాడారు. మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకులు పంచదార్ల దుర్గాంబ స్వాగతం పలికారు. మహిళా సమాఖ్య ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బి.ఝాన్సీలక్ష్మి, విజయవాడ నగర అధ్యక్షురాలు ఓర్సు భారతి, కార్యవర్గ సభ్యులు డి.సీతారావమ్మ, దుర్గాసి రమణమ్మ, లంక నాగమణి, చింతాడ పార్వతి, బి.శాంతి, రాహేలమ్మ, ఐద్వా నాయకులు జి.అమలశ్రీ, కె.దుర్గా వెంకటరత్నం, సౌమ్య, పీఓడబ్ల్యూ నాయకులు దుర్గ, లక్ష్మి, యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కె.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి బాలినేని, సామినేని, కిలారు

విశాలాంధ్ర-మంగళగిరి: వైసీపీ నేతలు బాలినేని శ్రీనివాసులురెడ్డి, సామినేని ఉదయభాను, కిలారు రోశయ్య జనసేన పార్టీలో చేరారు. తమ అనుచరులతో కలిసి మంగళగిరిలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమక్షంలో కండువాలు కప్పుకున్నారు. పవన్ కల్యాణ్‌కు శ్రీవెంకటేశ్వర చిత్రపటాన్ని సామినేని అందజేశారు. ఈ ముగ్గురు ఇటీవల వైసీపీకి రాజీనామా చేశారు. జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించారు. మరికొంత మంది వైసీపీ నేతలు కూడా జనసేన ముఖ్యనేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల కాపు నేతలు జనసేన వైపు చూస్తున్నట్లు ప్రచారముంది. విజయనగరం జిల్లాకు చెందిన వైసీపీ నాయకులు అవనపు విక్రమ్, అవనపు భావన, ప్రకాశం జిల్లాకు చెందిన యాదాల అశోక్ బాబు, నాగులుప్పలపాడు జెడ్పీటీసీ యాదాల రత్నభారతి కూడా జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న వేళ కీలక నాయకులంతా ఒక్కొక్కరిగా వైసీపీని వీడుతుండటంతో అధినేత జగన్‌మోహన్ రెడ్డి వెంటనే ఆయా జిల్లాల నేతలతో భేటీ అయి ఇన్‌చార్జీలను నియమిస్తున్నారు.

నేడు తిరుపతికి జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం రాత్రికి తిరుపతి వెళ్లనున్నారు. స్వామివారిని ఆయన శనివారం ఉదయం దర్శించుకోనున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న సీఎం చంద్రబాబు ఆరోపణల అనంతరం జగన్ తిరుమల పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. లడ్డూ కల్తీ ఆరోపణలపై జగన్ మీడియా సమావేశాన్ని నిర్వహించి తప్పుపట్టారు. అనంతరం ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖలు రాశారు. లడ్డూ వివాదంపై సమగ్ర దర్యాప్తు చేయించాలని కోరారు. తిరుమలను, లడ్డూను, వేంకటేశ్వరస్వామి విశిష్టతను అపవిత్రం చేసినందుకు చంద్రబాబు చేసిన ఈ పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో ఈనెల 28న పూజలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు జగన్ పిలుపునిచ్చారు. అదే రోజు జగన్ స్వామి వారిని దర్శించుకోనున్నారు. రాజకీయ దుర్బుద్ధితో కల్తీ జరిగినట్లు చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు.

శ్రీశైలం జలాశయం ఖాళీ?

ముందుచూపు లేకుండా నీటి వినియోగం

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: నిన్నటి వరకు నిండుకుండలా ఉన్న శ్రీశైలం జలాశయం ఖాళీ అవుతోంది. ముందు చూపులేకుండా జలాశయం నుంచి నీటిని దిగువ వదలడమే ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల దాహార్తిని తీర్చేందుకు, సాగు అవసరాలతో పాటు విద్యుత్ ఉత్పత్తికి జలాశయం నీటిని వినియోగించడం జరుగుతుంది. ఇటీవల కృష్ణా పరివాహ ప్రాంతంలో పెద్దఎత్తున వరదలు రావడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా జలశయానికి వరద పోటెత్తింది. దీంతో స్పిల్‌వే గేట్లు ఎత్తి... దిగువ సాగర్‌కు నీటిని విడుదల చేశారు. కాగా గత 10 రోజుల వరకు శ్రీశైలం జలాశయం పూర్తి నీటి మట్టం 885 అడుగులుండగా... పూర్తి నీటి సామర్థ్యం 215.807 టీఎంసీలు ఉంది. అయితే ప్రస్తుతం పెద్దఎత్తున విద్యుత్ ఉత్పత్తి పేరు మీద నీటిని విడుదల చేయడం వలన గురువారం జలాశయంలో నీటి మట్టం 875 అడుగులకు పడిపోగా... నీటి సామర్థ్యం 167.48 టీఎంసీలకు చేరింది. సుమారు 48 టీఎంసీల నీరు గత 10 రోజుల నుండి విడుదల చేయడం జరిగింది. కృష్ణా పరివాహ ప్రాంతం నుంచి వరదలు వస్తాయనే అతి విశ్వాసంతో అధికారులు ఇలా నీటిని ఇబ్బడిముబ్బడిగా వినియోగించారు. ఒక వేళ వరదలు రాకపోతే పరిస్థితి ఏమిటనే ప్రశ్న ప్రస్తుతం ఉత్పన్నమవుతోంది. ఈ ఏడాది కుడిగట్టు ఏపీ జలవిద్యుత్ కేంద్రం నుండి 766 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి జరిగితే... తెలంగాణ జలవిద్యుత్ కేంద్రం నుండి సుమారు 1000 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు సమాచారం. ఇలా ముందు చూపులేకుండా జలాశయం నుండి నీటిని విడుదల చేయడం వల్ల భవిష్యత్‌లో పెద్దనష్టం జరిగే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం ఎగువ సుంకేసుల నుండి 8959 క్యూసెక్కులు, జూరాల నుండి 87,194 క్యూసెక్కుల నీరు శ్రీశైల జలాశయానికి వచ్చి చేరుతుండగా... జలాశయం నుండి పోతిరెడ్డి పాడుకు 9వేల క్యూసెక్కులు, హంద్రీనివాకు 1688 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం ఏపీ విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయగా, తెలంగాణ జలవిద్యుత్ కేంద్రానికి 35,315 క్యూ సెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది కృష్ణా నుండి సుమారు 1050 టీఎంసీల నీరు సముద్రంలో కలిసినట్లు అధికారులు చెబుతున్నారు. పెద్దఎత్తున నీటిని సముద్రంలో కలిపి జలాశయంలో నీటిని ఖాళీ చేయడం వలన భవిష్యత్‌లో నీటి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. అధికారులు అంచనా వేసినట్లు జలశయానికి వరద కొనసాగితే... ఎటువంటి ఇబ్బందులు ఉండవు ఒక వేళ రాకపోతే ఏమిటనే ప్రశ్న ఉత్పన్న మవుతోంది.

మతమేదైనా స్త్రీలందరికీ వర్తిస్తుంది

గృహ హింస చట్టంపై సుప్రీంకోర్టు

న్యూదిల్లీ: మతం, సామాజిక నేపథ్యంతో పనిలేకుండా గృహ హింస చట్టం-2005తో ప్రతి మహిళ రక్షణ పొందవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది. రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులకు సమర్థ రక్షణ కోసం మహిళలందరికీ ఈ చట్టం వర్తిస్తుందని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ నేతృత్వ ద్విసభ్య ధర్మాసనం వెల్లడించారు. ఈ చట్టం సివిల్ కోడ్‌లో భాగమని చెప్పారు. గృహ హింస నుంచి మహిళలకు ఈ చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. భరణం, పరిహారానికి సంబంధించిన వ్యవహారంలో కర్నాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఓ మహిళ సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఈ మేరకు తీర్పు వెలువడింది. గృహ హింస చట్టంలోని సెక్షన్ 12 కింద ఒక పిటిషన్‌ను ఆ మహిళ గతంలోనే దాఖలు చేశారు. నెలవారీ ఖర్చులకు రూ.12వేలు, రూ.లక్ష పరిహారం ఇచ్చేలా 2015, ఫిబ్రవరిలో మెజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీచేశారు. అయితే ఆమె భర్త దీనిపై అప్పిలేట్ కోర్టుకు వెళితే ఆయన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టి వేసింది. సెక్షన్ 25 కింద మరొక పిటిషన్ కూడా తిరస్కరణకు గురైనట్లు సుప్రీంకోర్టు గుర్తించింది. ఈ పరిణామాలతో సదరు మహిళ హైకోర్టుకు వెళితే, ఆమె పిటిషన్ గతేదాది ఏప్రిల్‌లో కొట్టివేశారు. ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు, ఫస్ట్ అప్పిలేట్ కోర్టు తీర్పులను సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. భర్త పిటిషన్‌ను కొట్టివేసింది. అయితే సెక్షన్ 25 కింద ప్రతివాది (భర్త) కొత్తగా ఫిర్యాదు చేసుకోవచ్చని పేర్కొంది.

మద్యం షాపులు రద్దు చేస్తూ ఆర్డినెన్స్ జారీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. రిటైల్ లిక్కర్ షాపులకు అనుమతి ఇస్తూ చట్టసవరణ చేసింది. ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకుంది. గత వైసీపీ ప్రభుత్వం... ప్రైవేటు మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రభుత్వం ద్వారా మద్యం షాపులను ఏర్పాటు చేసి వ్యాపారం చేసిన విషయం తెలిసిందే.

కూలి పెంచండి

నేడు హమాలీల సమ్మె

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో పౌర సరఫరాల కార్పొరేషన్ మండల స్టాక్ పాయింట్లలో లోడింగ్-అన్‌లోడింగ్ చేసే ముఠా కార్మికుల కూలి పెంచాలని సివిల్ సప్లై హమాలి యూనియన్ డిమాండ్ చేసింది. గత ఒప్పందం ప్రకారం క్వింటాలుకు రూ.30 చెల్లించాలని కోరింది. స్థానిక గొల్లపూడి మండల స్టాక్ పాయింట్ వద్ద గురువారం జరిగిన నిరసనలో పాల్గొన్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య... కూలి ఐదు రూపాయలు చొప్పున పెంచి రూ.30 చేయాలని, బోనస్ రూ.10 వేలకు తక్కువ కాకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలి పెంచకపోతే ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సివిల్ సప్లై భవన్‌ను ముట్టడిస్తామన్నారు. శుక్రవారం (27న) మెరుపు సమ్మె చేస్తామని, రెండు గంటలు పని ఆపేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మండల స్టాక్ పాయింట్ వద్ద ఉద్యమం జరుగుతుందన్నారు. రాష్ట్రం స్థాయి నుంచి మండల స్థాయి వరకు ఏఐటీయూసీ నాయకులందరూ పాల్గొంటా రని తెలిపారు. హమాలీల సమస్యలను త్వరితగతిన పరిష్కరించకపోతే పేదలకు ఇచ్చే బియ్యం ఎగుమతి, దిగుమతి ఆగిపోతుందని ప్రభుత్వాన్ని వెంకట సుబ్బయ్య హెచ్చరించారు. నిరసనలో పెద్ద మేస్త్రులు తాతయ్య, రాఘవరావు,వీరయ్య, రమణ, సత్యం, శివరామ్ పాల్గొన్నారు.

4 జిల్లాలకు వైసీపీ నూతన అధ్యక్షులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి చవిచూసిన నేపథ్యంలో పార్టీ నేతలతో జగన్ వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అనేక జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలను నియమించారు. తాజాగా విశాఖ, అనకాపల్లి, అల్లూరి, బాపట్ల జిల్లాల నేతలతో వైసీపీ అధినేత జగన్ సమావేశమయ్యారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయా జిల్లాల నేతలు హాజరయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై నేతలతో చర్చించి, పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని జగన్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైసీపీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, అవంతి శ్రీనివాస్, కేకే రాజు హాజరయ్యారు. ఈ క్రమంలో వైసీపీ విశాఖజిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనాకపల్లిజిల్లాకు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, అల్లూరి జిల్లాకు విశ్వేశ్వరరాజు, బాపట్లజిల్లాకు మాజీ మంత్రి మేరుగ నాగార్జునను పార్టీ అధ్యక్షులుగా నియమించినట్లు ప్రకటించారు. అలాగే పీఏసీ సభ్యులుగా మాజీ మంత్రి ఆదిమూలపు సురేశ్, భాగ్యలక్ష్మి, బాపట్ల పార్లమెంట్ పరిశీలకులుగా మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు పదవుల్లో చోటు దక్కింది. విశాఖ వెస్ట్ అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా మళ్లా విజయ్‌ప్రసాద్, వైసీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా కొట్టగుల్లి భాగ్యలక్ష్మిని నియమించారు. కాగా ఈనెల 25వ తేదీన కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నేతలతో జగన్ సమావేశమై... జిల్లాలకు నూతన పార్టీ అధ్యక్షులను నియమించారు. కృష్ణాజిల్లాకు పేర్ని వెంకట్రామయ్య(నాని), ఎన్టీఆర్‌కు దేవినేని అవినాశ్, గుంటూరుకు అంబటి రాంబాబును నియమించారు. విజయవాడకు చెందిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌ను పార్టీ రాజకీయ సలహా కమిటీ (పీఏసీ) సభ్యునిగా నియమించారు.

మన్మోహన్‌కు శుభాకాంక్షల వెల్లువ

న్యూదిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ 92 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా... గురువారం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. దేశ భవిష్యత్తును రూపొందించడంలో ఆయన వినయం, మేధస్సు, నిస్వార్థ సేవను ప్రస్తుతిస్తూ...కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సహా అనేక మంది కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. 'రాజకీయ రంగంలో సరళత, గౌరవం, చాతుర్యం గల అరుదైన స్వరూపం... మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ జీకి నా హృదయపూర్వక శుభాకాంక్షలు' అని ఖర్గే అన్నారు. దార్శనికుడైన రాజనీతిజ్ఞుడు, ఆయన చర్యలు మాటల కంటే బిగ్గరగా మాట్లాడతాయి. ఆయన దేశానికి చేసిన అద్భుతమైన, అమూల్యమైన సేవలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఖర్గే అన్నారు. ఆయనకు మంచి ఆరోగ్యం, సంతోషం, దీర్ఘాయువు ఉండాలని ఆకాంక్షించారు. 'డాక్టర్ మన్మోహన్ సింగ్ జీకి జన్మదిన శుభాకాంక్షలు. మన దేశ భవిష్యత్తును రూపొందించడంలో మీ వినయం, జ్ఞానం, నిస్వార్థ సేవ నాతోపాటు మిలియన్ల మంది భారతీయులకు స్ఫూర్తినిస్తూనే ఉంది. మీరు ఎల్లప్పుడూ మంచి ఆరోగ్యం, ఆనందంతో ఉండాలని కోరుకుంటున్నాను' అని రాహుల్ గాంధీ 'ఎక్స్' లో చెప్పారు. ఇక కాంగ్రెస్ పార్టీతో పాటు అనేకమంది పార్టీ నాయకులు మన్మోహన్ సింగ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మన్మోహన్‌సింగ్ 2004, 2014 మధ్య దశాబ్దకాలం భారతదేశానికి ప్రధానమంత్రిగా ఉన్నారు. మరియు 1991-96 కాలంలో పీవీ నరసింహారావు నేతృత్వంలోని ప్రభుత్వంలో దేశ ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఈ కాలంలో పరివర్తనాత్మక ఆర్థిక సంస్కరణలు జరిగాయి.

దళారులను నమ్మొద్దు: సమగ్ర శిక్షా ఎస్పీడీ సూచన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్షా అధ్వర్యంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో(కేజీబీవీ) ఉద్యోగాల కోసం దళారులను నమ్మి మోసపోవద్దని అభ్యర్థులకు సమగ్రశిక్షా ఎస్పీడీ శ్రీనివాసరావు హితవు పలికారు. 507 మంది బోధన సిబ్బందిని ఒప్పంద ప్రాతిపదికన, 97 మంది బోధనేతర సిబ్బందిని పొరుగు సేవల (ఔట్ సోర్సింగ్) ప్రాతిపదికన ఏడాది కోసం నియమించేందుకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. దళారుల పైరవీల గురించి వార్తలు వస్తున్నాయని, రూ.లక్ష నుంచి రూ.5 లక్షలు చెల్లిస్తే (అడ్వాన్స్‌గా రూ.20వేలు నుంచి రూ.80వేలు) ఉద్యోగం పక్కా అని అభ్యర్థులకు ఆశ చూపుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. నియామకాలు పారదర్శకంగా జరుగుతాయని, ప్రక్రియ కలెక్టర్ల అధ్వర్యంలో మెరిట్ ఆధారంగా సాగుతుందని తెలిపారు. ఏ పోస్టుకు మౌఖిక పరీక్షలు, నైపుణ్యత పరీక్షలు ఉండవన్నారు. ఇంటర్వ్యూలో మార్కులు వేయిస్తాం, ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా ప్రలోభ పెడితే కలెక్టరేట్‌లోగానీ రాష్ట్ర సంచాలకుల కార్యాలయంలో గానీ ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్హతలు, ప్రతిభ ఆధారంగానే నియామకాలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులను ప్రలోభ పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని దళారులను శ్రీనివాసరావు హెచ్చరించారు.

మానవ అక్రమ రవాణా కట్టడి: అనిత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మానవ అక్రమ రవాణా అరికట్టడమే లక్ష్యంగా కఠిన చట్టాలు అమలు చేయాలని, ప్రతి జిల్లాకు ఒక సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మానవ అక్రమ రవాణా కేవలం మానవ హక్కుల ఉల్లంఘన కాదని, ఇది జీవితాలను, సమాజాలను నాశనం చేసే నేరమని చెప్పారు. నోవాటెల్ హోటల్‌లో గురువారం 'నేషనల్ కన్సల్టేషన్ ఆన్ కౌంటరింగ్ సైబర్-ఎనేబుల్డ్ ట్రాఫికింగ్'పై సదస్సు ఏర్పాటు చేశారు. డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, ఐటీ సెక్రటరీ సౌరభ్ గౌర్, 27 రాష్ట్రాల పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జ్యుడీషియల్ అకాడమీ సంచాలకులు, మహిళా, శిశు సంక్షేమ శాఖల అధికారులు, ఎన్జీవో ప్రతినిధులు హాజరయ్యారు. అనిత మాట్లాడుతూ, పద్మశ్రీ సునీత కృష్ణన్‌తో కలిసి సదస్సులో మాట్లాడడం గర్వంగా ఉందన్నారు. మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ ... సమిష్టి కృషి తమకు ఒక మార్గాన్ని అందించిందన్నారు. డీజీపీ మాట్లాడుతూ నేషనల్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్, ఐటీ సెక్రటరీ సౌరవ్ గౌర్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ.సూర్య కుమారి, పౌర సమాజ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జెత్వానీ కేసు వేగవంతం: ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసు వేగవంతంగా దర్యాప్తు జరుగుతోందని, ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్‌లను సస్పెండ్ చేశామని హోంశాఖ మంత్రి అనిత చెప్పారు. ఈ కేసులో తప్పు చేసిన ఎవర్ని వదిలే ప్రసక్తేలేదని హెచ్చరించారు. ఈ కేసును సీఎం చంద్రబాబు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని వివరించారు. చిన్నారులు, మహిళల రక్షణే మొదటి ప్రాధాన్యతిస్తామని చెప్పారు. మహిళల ఫొటోలను మార్ఫింగ్ చేసి డబ్బులు వసూలు చేసే మాఫియాల పని పడతామన్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌ను సకల వసతులతో తీర్చిదిద్దుతామని చెప్పారు.

జగన్‌కు గణేశ్ లడ్డూ ప్రసాదం అందజేత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు వినాయకుడి లడ్డూ ప్రసాదాన్ని (20 కిలోలు) విశాఖపట్నం గాజువాక గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు. గాజువాకలో 89 అడుగుల మహాగణపతిని ఏర్పాటు చేసి గణేశ్ ఉత్సవ కమిటీ అధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించారు. జగన్‌ను కలిసిన వారిలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోసిరెడ్డి గణేశ్, వైసీపీ విద్యార్థి విభాగం నేత జిలకర్ర నాగేంద్ర, వైసీపీ కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఉన్నారు.

మహారాష్ట్రతో 'మేఘా' ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మహారాష్ట్రలో 21 వేల కోట్ల పెట్టుబడితో నాలుగువేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు భారీ పంప్ స్టోరేజ్ జల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి ఆ రాష్ట్ర ప్రభుత్వంతో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) గురువారం ఒప్పందం చేసుకుంది. ఒప్పందం పై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో జల వనరులశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి దీపక్ కపూర్, మేఘా సంస్థ తరపున కంపెనీ ప్రెసిడెంట్ ఆర్.వి.ఆర్. కిషోర్ సంతకాలు చేశారు. ఎం ఈ ఐ ఎల్ 'బిల్డ్-ఓన్-మెయింటెనెన్స్(బి ఓ ఎం) విధానంలో నిర్మిస్తున్న తొలి ప్రాజెక్టులు ఇవి. ఈ ఒప్పందం లో భాగంగా, మేఘా సంస్థ, మహారాష్ట్ర లోని నందుర్బార్ జిల్లాలోని కామోడ్ వద్ద ఒక పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్, ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలోని ఘోస్లా వద్ద రెండవ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును నిర్మించనుంది . రూ 21 వేల కోట్లతో నిర్మించే ఈ జల విద్యుత్ కేంద్రాల ద్వారా నాలుగు వేల మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ సందర్భంగా ఫడ్నవీస్ మాట్లాడుతూ నీటి వినియోగం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని అన్నారు. ఈ ప్రాజెక్ట్ తమ రాష్ట్రానికి బహుళ ఉపయోగకారిగా ఉంటుందని, రెండున్నర వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరీష్ , రవి కిరణ్, సమీర్ ఝా లు పాల్గొన్నారు.

ప్రపంచ బ్యాంకు ప్రతినిధితో మంత్రి కొండపల్లి భేటీ

వరదలు, కరువు నివారణ చర్యలపై ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు మైక్ వెబ్‌స్టర్ సమ్మతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అమెరికాలో పర్యటిస్తున్నారు. దీనిలో భాగంగా న్యూయార్క్‌లో వివిధ రంగాల ప్రముఖులతో మంత్రి సమావేశమయ్యారు. ప్రపంచ బ్యాంకు సహజ వనరుల పరిరక్షణ ప్రాజెక్ట్ ప్రతినిధి మైక్ వెబ్‌స్టర్‌తో గురువారం ఆయన భేటీ అయ్యారు. వరదలు కరువు నివారణ చర్యలపై చంద్రబాబు నాయుడు ప్రభుత్వంతో కలిసి పని చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. చిత్తూరు జిల్లాలో తాము చేపట్టిన కార్యక్రమాలకు చంద్రబాబు ప్రభుత్వ ప్రోత్సాహం, సహకారాన్ని ఈ సందర్భంగా మైక్ వెబ్‌స్టర్ గుర్తు చేసుకున్నారు. వరదలు, కరువు నివారణ చర్యలపై చేపట్టే ప్రాజెక్టులకు ప్రపంచ బ్యాంక్ ప్రోత్సాహం ఎప్పుడు ఉంటుందని తెలిపారు. అనంతరం సౌరశక్తి రంగంలో నూతన ఆవిష్కరణలపై షెల్ ఫౌండేషన్ సీఈవో జోనాథన్ బెర్మాన్, పోర్ట్‌ఫోలియో అధిపతి మీరా షాతో మంత్రి శ్రీనివాస్ చర్చించారు. వ్యవసాయం రంగంలో సౌరశక్తి వినియోగాన్ని పెంచడం కోసం, నూతన ఆవిష్కరణల అవసరంపై ఇద్దరితో మంత్రి చర్చలు జరిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తమ వంతు సహకారం అందించేందుకు వివిధ రంగాల ప్రముఖులు ముందుకు రావటంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.